JANASAMAYAM FORTNIGHTLY TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 7 16-31 జులై 2026 ఎడిటర్: వి. యాదమ్మ పేజీలు:52 వెల: 20/-



# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయం సి.యం. ఏ. రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్ (జనసమయం ప్రతినిధి)

పారిశ్రామిక ,సాగునీటి, వ్యవసాయ రంగాలలో మౌలిక వసతులను కల్పించి స్పష్టమైన విధానాల రూపకల్పన ద్వారా 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్ ప్రాజెక్టులో భాగంగా అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్‌లో నూతనంగా నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరరాజా సంస్థ దాదాపు నాలుగు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణం అనంతరం తన తొలి భారీ పెట్టుబడిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో ఎదగాలంటే అమరరాజా వంటి సాంకేతిక సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని, వాటికి అవసరమైన అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీలో తెలంగాణ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో 32 గిగావాట్ గంటల (GWh) సామర్థ్యంతో అమరరాజా కంపెనీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ పరిశ్రమ ద్వారా 700 మంది ఇక్కడ మహబూబ్‌నగర్ జిల్లా వారికి ఉపాధి లభిస్తుండగా, వారిలో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను మరింత బలోపేతం చేస్తూ పారదర్శక పాలన, అత్యుత్తమ మౌలిక వసతులు, పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాలకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తూ 2047 నాటికి దేశ అభివృద్ధిలో తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీ గా తీర్చిదిద్ది కీలక శక్తిగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశ జనాభాలో తెలంగాణ కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నదని చెప్పారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలను పారిశ్రామిక, సేవారంగ, వ్యవసాయ ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి తయారీ పరిశ్రమలను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా అమర్ రాజా కంపెనీ 32 గిగావాట్ల ప్లాంటును ప్రారంభించు



కోవడం ఒక నిదర్శనమని అన్నారు .2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించే లక్ష్యంగా ఎనర్జీ లక్ష్యాన్ని చేపట్టడం జరిగిందని, విద్యుత్ పరిశ్రమలే కాకుండా, ఎనర్జీ పరిశ్రమలు తీసుకురానున్నమని, క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. 2031 నాటికి ఈవి బ్యాటరీల వినియోగం నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రతి ఒక్కరు గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తున్నారని, బ్యాటరీ తయారీలో తెలంగాణ అద్భుతంగా ఉందని ,2023లో 6.8%గా ఉన్న పరిశ్రమల అభివృద్ధి 2026 నాటికి 8.1% చేరుకున్నామని, 2034 నాటికి 13% చేరుకునేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీ.కే అరుణ మాట్లాడుతూ అమర రాజా వంటి కంపెనీ మహబూబ్‌నగర్ ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంతాలవాసుల అదృష్టం అని అన్నారు. ప్రస్తుతం మనం విదేశాల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నామని, మన డబ్బు విదేశాలకు పోకుండా మనమే అభివృద్ధి చేసుకునేలా ప్రధాన మంత్రి ఆలోచిస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివిటిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అమర రాజా కంపెనీ గిగా మ్యానుఫ్యాక్చరింగ్ కారిడార్ గా రూపకల్పన కాబోతున్నదని, ఇది దేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉపయోగపడే ఫ్యాక్టరీ కాబోతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అన్ని పట్టణాలలో ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తున్నామని, రాబోయే రోజుల్లో 30 వేల ఎకరాలలో అనేక కంపెనీలు రానున్నాయని తెలిపారు. అమర రాజా కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్, విక్రమాదిత్య లు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ ,యువజన క్రీడల సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,ఎస్పీ జానకి, తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037

సంపుటి : 01 సంచిక : 07 16-31 జులై 2026 పేజీలు : 52 వెల :

## లోపల పేజీలో....

| | |
|---|---|
| కెసిఆర్‌కు ఏమైంది | 6 |
| మిడ్జిల్ మండలానికి | 7 |
| కళ్యాణలక్ష్మి | 13 |
| ఈటెల వ్యూహం | 14 |
| ఎయిర్‌పోర్టు నిర్మాణం | 19 |
| బేగంపేట్ | 25 |
| కాళేశ్వరం | 27 |
| రేవంత్ ఐదున్నర | 28 |
| కాళేశ్వరం పై రాజకీయ చర్చ | 30 |
| ఆర్టీసీలో | 33 |
| రాజ్యాంగం | 40-43 |
| సాహిత్యం | 44 |
| ఆరోగ్యం | 46 |
| క్రీడలు | 48 |
| సినిమా | 49 |

Editor, Publisher & Owned By :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana-509380

Editor :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana -509380
Cell : 9381205266
email : janasamayam@gmail.com

Printer : **VARDA YADAIAH**
Printed at : Mythri Art Printers,
Shop No. 10, Dcc Bank Complex,
Mahabubnagar,Telangana-509001.

Place of Publication **V.YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal, Wanaparthy Dist.
Telangana -509380
Cell : 9381205266

*Ads Manging Director*
Panditi Prudhvi Kumar Reddy
Cell : 8977022449

# సంపాదకీయం

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

*భారత రాజకీయ యవనికపై అత్యంత భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం వేదిక సిద్ధం చేస్తోంది. ఒకేసారి మూడు చారిత్రాత్మక సంస్కరణలను అమల్లోకి తెచ్చేందుకు చట్టసభల్లో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. వన్ నేషన్-వన్ ఎలక్షన్ , నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం పార్లమెంట్‌లో ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలను సంపూర్ణంగా మార్చేయబోతున్నాయి. ఈ మూడు బిల్లుల కలయిక కేవలం ఎన్నికల సంస్కరణ మాత్రమే కాదు, ఇది భారత ఫెడరల్ నిర్మాణాన్ని, ప్రాతినిధ్య రాజకీయాలను సరికొత్త దిశకు తీసుకెళ్లే ఒక సుదీర్ఘ ప్రయాణం. దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు భారత ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని, శ్రమను భారీగా తగ్గించడమే లక్ష్యంగా తెస్తున్నారు. పార్లమెంటరీ సంయుక్త కమిటీ అంచనాల ప్రకారం.. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 7 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వల్ల నిలిచిపోయే అభివృద్ధి పనులకు విముక్తి లభిస్తుంది. అయితే, మధ్యలో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అక్కడ కొత్తగా ఎన్నికయ్యే సభ కేవలం మిగిలిన కాలపరిమితి కి మాత్రమే పరిమితం అవుతుందనే ప్రతిపాదన ప్రాంతీయ పార్టీలలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానాన్ని 2029 కల్లా పూర్తి స్థాయిలో అమల్లోకి తేవాలని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల పరిమితిని సవరించి, నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం ప్రతిపాదించిన చట్టాల ప్రకారం.. లోక్‌సభ గరిష్ట స్థానాల సంఖ్యను 550 నుండి ఏకంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఎవరికీ అన్యాయం జరగకుండా యాభై శాతం సీట్ల ఫార్ములాను తీసుకు వచ్చింది. గతంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కావాలంటే జనాభా లెక్కలు, పునర్విభజన పూర్తి కావాలనే నిబంధన ఉండేది. కానీ, తాజా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే మహిళా కోటాను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాబోయే 2029 సాధారణ ఎన్నికల నాటికి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీలలో 33 శాతం స్థానాలు మహిళలకే దక్కుతాయి. ఇది భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని క్రింది స్థాయి నుండి అగ్రస్థాయి వరకు అనూహ్యంగా పెంచే విప్లవాత్మక మార్పు కానుంది. ఈ మూడు మహా బిల్లులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. పునర్విభజన జరిగితేనే పెరిగిన సీట్లలో మహిళా రిజర్వేషన్లు పక్కాగా అమలవుతాయి, ఆ సీట్ల ఆధారంగానే వన్ నేషన్-వన్ ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఈ స్థాయి భారీ రాజ్యాంగ సవరణలు కేవలం పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సాధ్యం కాదు. దీనికి రెండు పద్ధతుల ప్రత్యేక మెజారిటీ తో పాటు కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ప్రాంతీయ పార్టీలను ఒప్పించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటం, ఒకేసారి దేశవ్యాప్తంగా ఈవీఎంల సరఫరా వంటి భారీ లాజిస్టికల్ సవాళ్లు కేంద్రం ముందున్నాయి.*

V. Yadamma
ఎడిటర్

# అన్ని పార్టీల ఎంపీలకు కర్తవ్య బోధ చేసిన సీఎం రేవంత్ రెడ్డి!




తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కేంద్రం నుంచి ప్రాజెక్టులు మరియు మౌలిక వసతుల అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వీటిపై ప్రధానమంత్రికి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని పార్టీల ఎంపీలతో నిర్వహించిన కీలక సమావేశంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాల న్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి సాగుదాం అన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అందరూ కలిసి ముందుకు సాగాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రజా భవన్ లో జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లురవి, ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్యాదవ్, రామసహాయం రఘురామిరెడ్డి, రఘువీర్ రెడ్డి, కడియం కావ్య తదితరులతో నిర్వహించిన సమావేశంలో కీలకవ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్రానికి విన్నపం నీటిపారుదల ప్రాజెక్టులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుంచి అనుమతులు నిధులు సాధించడం పైన ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైన దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ను కలవాల,ని మూసీ నదిపునరుజ్జీవనం ఫేస్ వన్ పనులకు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద అనుమతులు పొందాలని సూచించారు. ప్రధానంగా ఇరిగేషన్, వ్యానాశ్రయాలు, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ లపై చర్యలు అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మెట్రో ఫేజ్ 2 విస్తరణపైన, ఆర్ఆర్ఆర్ భూసేకరణ పనుల పైన అందరూ వేగంగా పని చేయాలన్నారు. వరంగల్ ఆదిలాబాద్ విమానాశ్రయం అభివృద్ధి, బుల్లెట్ రైలు ప్రాజెక్టులపైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తుంగభద్ర, గోదావరి నీటిపంపకాలు, గోదావరి కావేరి అనుసంధానం, తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ వంటి కీలక అంశాలపైన, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలతో జరిగిన చర్చల వివరాలను ఎంపీలకు తెలియజేశారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై అందరూ ఒక్కటిగా స్పందించాలి రాష్ట్ర ప్రయోజనాలను రక్షించిన కేంద్ర మంత్రులు, ప్రధాని వద్ద విజ్ఞప్తులు చేయాలని ఆయన మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఉన్న సమస్యల పైన ఎంపీలు కూడా సానుకూలంగా స్పందించాలని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిల్లింగ్ సామర్థ్యం, స్టోరేజ్ సమస్యలు, స్టాండింగ్ కమిటీల ద్వారా పెండింగ్ అంశాలు పరిష్కరించడం వంటి సూచనలు చేశారు.

# కేసీఆర్ కు ఏమైంది..

హైదరాబాద్,జనసమయం ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేజీఆర్ రాజకీయ జోష్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస ప్రభుత్వమే ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి



తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు. ఎన్నికలు కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్‌ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రాజెక్టు చేసుకోలేకపోతున్నారు. బీఆర్‌ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్‌ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం. తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్‌ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

# మిడ్జిల్ మండలానికి ప్రాణం ఇచ్చినా తక్కువే

# మిడ్జిల్ మండలాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాపై ఉంది

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్, ప్రతినిధి :**

ఒకప్పుడు డార్క్ మండలంగా పేరొందిన మిడ్జిల్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం లో నిర్వహించిన కృతజ్ఞతాభినందన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జులై 4,2006న మిడ్జిల్ మండలం నుండి తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఇక్కడి ప్రజలు తనను ఆశీర్వదించి జడ్పిటిసి గా గెలిపించినందునే ఈరోజు తను ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నానని తెలిపారు. మిడ్జిల్ మండలానికి గొప్ప చరిత్ర ఉందని, ఈ గడ్డ నుండి బూరుగుల రామకృష్ణారావు, జైపాల్ రెడ్డి, ధావ గోపాల్ రెడ్డి వంటి ఎందరో మహానుభావులు వచ్చారన్నారు. తన గెలుపు తనది కాదని మిడ్జిల్ మండల ప్రజలదాని అన్నారు. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన మండలం గా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మిడ్జిల్, గట్టు మండలాలు డార్క్ మండలాలుగా మిగిలిపోయాయని, అలాంటి మిడిల్ మండలాన్ని అభివృద్ధి చేసి జిల్లా లోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మండలాన్ని దత్తత తీసుకొని పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కతో కోరారు. మిడ్జిల్ మండలాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందన్నారు. తాను రాజకీయంగా మిడ్జిల్ నుండి వచ్చినప్పటికీ పదవి లేకపోయినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజా సమస్యల కోసం పోరాటం చేశానని ,తాము అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణను, మాదిగ ,మాల వర్గీకరణ చేశానని, 100 సంవత్సరాల సమస్య అయిన జనగణనలో కులగలను పూర్తి చేశానని, గ్రామాలు, ప్రాంతాలు, ప్రజలు కలిస్తేనే తెలంగాణ రాష్ట్రమని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అడిగిన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఇస్తున్నామని, నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని, 21,000 కోట్ల రైతు రుణమాఫీ చేశామని , గత ప్రభుత్వం ఎనిమిదిన్నర లక్షల రూపాయల అప్పులను మిగిల్చి వెళ్లిందని అన్నారు. మిడ్జిల్ మండలానికి ప్రాణం ఇస్తానని ,జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం, ప్రతి ఒక్కరికి విద్యను అందించే వరకు సేవ చేస్తానని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఒక జెడ్పిటిసిగా ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం అని అన్నారు. ప్రజా సంక్షేమమే ఏజెండాగా తమ పరిపాలన





కొనసాగుతున్నదని, పాలనంటే అధికారం కాదని, ప్రజల కోసం పాటుపడడమని, రాష్ట్రంలో కోటి 15 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని, 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందిస్తున్నామని, నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించామని, వడ్డీ లేని రుణా లో భాగంగా ప్రతి సంవత్సరం స్వయం సహాయక మహిళా సంఘాలకు 20 వేల కోట్లు ఇస్తున్నామని, ప్రజల అవసరాలు తీర్చడమే పరిపాలన అని అన్నారు. స్థానిక శాసనసభ్యులు సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర స్పోర్ట్స్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడారు. మాజీ పార్లమెంట్ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ,కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ,షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, ఇతర శాసనసభ్యులు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ,ఒబెదుల్లా కొత్వాల్ ,నరితా తిరుపతయ్య, మాజీ శాసనసభ్యులు సంపత్ , జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, తదితరులు హాజరయ్యారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.47.08 కోట్లతో మిడ్జిల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

రూ.10 కోట్లతో ఊరుకొండపేట శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.20 కోట్లతో పాత మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీల అభివృద్ధికి శంకుస్థాపన, ( ఈ 40 గ్రామాలు మండలాల పునర్విభజన తరువాత ప్రస్తుతం మిడ్జిల్ మండలంలో 24 గ్రామాలు, ఊరుకొండ మండలంలో 16 గ్రామాలుగా ఉన్నాయి). రూ.17,08,45000 వ్యయంతో మిడ్జిల్ మండలంలో చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతేకాక మిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధ్యాపా గోపాల్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



# తెలంగాణలో 3 లక్షల మందికి కొత్త పెన్షన్లు

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోన్న పెన్షన్ల పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనలో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. సాంకేతిక ఆధారిత లైఫ్ అథెంటికేషన్ ప్రక్రియ ద్వారా దాదాపు లక్ష మందికి పైగా అనర్హులు, కొన్నేళ్ల క్రితమే మరణించిన వారి పేర్లతో అక్రమంగా పెన్షన్లు పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ దొంగ పెన్షన్లను తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించిన సర్కార్.. ఆ నిధులను వృథా చేయకుండా కొత్తగా 3 లక్షల మంది నిజమైన నిరుపేదలకు, అర్హులకు పెన్షన్లు మంజూరు చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

తెలంగాణలో అర్హులైన నిరుపేదలకు అండగా నిలవాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో కొన్నేళ్లుగా సాగుతున్న భారీ దోపిడీకి, అక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సంక్షేమ పథకాలు దుర్వినియోగం కాకూడదనే సంకల్పంతో అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో దిమ్మతిరిగే నిజాలు బట్టబయలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం లక్ష మందికి పైగా అనర్హులు దొడ్డిదారిన నెలవారీగా ప్రభుత్వ పెన్షన్లను అందుకుంటున్నట్లుగా ప్రభుత్వం అధికారికంగా నిర్ధారించింది. ఇందులో దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్నేళ్ల క్రితమే మరణించిన లబ్ధిదారుల పేర్లను అలాగే ఉంచి వారి స్థానంలో కొందరు అక్రమార్కులు అధికారుల కళ్లు గప్పి నెలనెలా డబ్బులు డ్రా చేసుకుంటున్నట్లు నిఘా వర్గాల అంతర్గత విచారణలో క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమైంది. ఈ భారీ అవినీతిని అడ్డుకునేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తుంది. లబ్ధిదారులు అసలు బతికే ఉన్నారా లేదా అని నిర్ధారించే లైఫ్ అథెంటికేషన్ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి చేసింది. ఈ డిజిటల్ వెరిఫికేషన్ ప్రక్రియతో దొంగ పెన్షన్ల దందా పూర్తిగా బయటపడింది. దీంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు చనిపోయిన వారి పేర్లను, అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకపోయినా పెన్షన్లు పొందుతున్న వారి



ఎదురుచూస్తున్న నిజమైన లబ్ధిదారులకే అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులను గుర్తించేందుకు గ్రామ, వార్డు స్థాయిల్లో అధికారులు ఇప్పటికే సర్వే ప్రక్రియను ముమ్మరం చేశారు. దీనికి అదనంగా తాజాగా గుర్తించిన ఒక లక్ష మంది అనర్హుల స్థానంలో.. మరో లక్ష మంది కొత్త అర్హులైన పేదలను ఎంపిక చేసి వారికి త్వరలోనే పెన్షన్లను మంజూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే పూర్తిస్థాయి కసరత్తును పూర్తి చేసింది.

ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రంలో కొత్తగా దాదాపు 3 లక్షల మంది పేదలకు ఆర్థిక భద్రత లభించనుంది. కొత్తగా పెన్షన్లు అందబోతుండటంతో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ఈ సామాజిక వర్గాలకు ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటగా నిలిచింది. అర్హుల వడపోత ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు సచివాలయ ఉన్నత వర్గాలు వెల్లడించారు.

# సీఎం రేవంత్ 20 ఏళ్ల పొలిటికల్ జర్నీ అద్భుత ప్రయాణమంటూ ఎమోషనల్ పోస్ట్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి 20 ఏళ్ల పొలిటికల్ జర్నీ పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్ట్ చేశారు. మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డిగా మొదలై.. ప్రజల గుండెల్లో రేవంతన్నగా నిలవడం తన జీవితంలో అద్భుత అధ్యాయమన్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని తాను 2006 జులై 4న తొలిసారి జడ్పీటీసీగా గెలిచిన మిడ్జిల్ మండలంలో ఇవాళ నిర్వహించబోయే కృతజ్ఞత వందన సభకు ముఖ్యమంత్రి హోదాలో హాజరై ప్రజలకు ధన్యవాదాలు తెలపడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన 20 ఏళ్ల ప్రజా జీవితంపై ఎమోషనల్ అయ్యారు. ప్రజా క్షేత్రంలో తానేంటో నిరూపించుకుంటూ సాగిన ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం తన జీవితంలోనే అత్యంత ప్రత్యేకమైన అధ్యాయమని అభివర్ణించారు. తన రెండు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ట్విట్టర్ ఎక్స్ వేదికగా సుదీర్ఘ భావోద్వేగ పోస్ట్‌ను పంచుకున్నారు. ఈ ఇరవై వసంతాల ప్రయాణంలో తాను ఎన్నో అద్భుతమైన విజయాలను చూశానని, అలాగే మరెన్నో ఊహించని సవాళ్లను, ఒడిదొడుకులను ఎదుర్కొన్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. ఏ పరిస్థితి ఎదురైనా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడమే తన శ్వాసగా మార్చుకున్నానని తెలిపారు. లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా.. తరగని మధుర జ్ఞాపకం..ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం. నాడు మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డిగా మొదలై.. నేడు మీ అందరి గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ప్రత్యేక అధ్యాయం. ఈ 20 ఏళ్లలో ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి సంఘర్షణలో, ప్రజల కోసం నేను చేసిన ప్రతి పోరాటంలో నాతో నిలిచిన, నాతో నడిచిన ప్రతి ఆత్మీయుడికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,



రాజకీయ కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు. ఇదే స్ఫూర్తితో, ప్రజలకు మరింత సేవ చేయాలన్న ఆర్తితో, మీ అందరి ఆశీర్వాద బలంతో, భవిష్యత్తులో తెలంగాణ పునర్ నిర్మాణ శ్రామికుడిగా.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా.. అన్నింటికీ మించి రేవంతన్నగా.. మీ హృదయాల్లో నా స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇస్తున్నాను.' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాగా, రేవంత్‌రెడ్డి నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రజాప్రతినిధిగా తన రాజకీయ జీవితంలో తొలి విజయానికి పునాది వేసిన మిడ్జిల్ మండలానికి ఆయన తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రానుండడంతో స్థానికంగా భారీ ఏర్పాట్లు చేశారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం.. అంటే 2006 జులై 4వ తేదీన రేవంత్‌రెడ్డి మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేసి ఘనవిజయం సాధించారు. ఆయన 20 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం విజయవంతంగా పూర్తవుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని నాటి నుండి నేటి వరకు తనకు అండగా నిలిచిన ఈ ప్రాంత ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు 'కృతజ్ఞత వందన సభ'ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు కూడా చేయనున్నారు.

# కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి షాక్.. TRS పేరు మార్చాలని ఈసీ ఆదేశాలు

కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)పార్టీ పేరుపై ప్రజా అభ్యంతరాలు ఉన్నాయంటూ కేంద్ర ఎన్నికల సంఘం దాని రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించింది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని, లేదంటే దరఖాస్తును రద్దు చేస్తామని ఈసీ స్పష్టం చేసింది. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని, న్యాయపోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ బీఆర్ఎస్‌గా మార్చిన పాత 'టీఆర్ఎస్' సెంటిమెంట్‌ను కొనసాగించాలనే వ్యూహంతోనే కవిత ఇటీవల ఈ పార్టీని ప్రకటించారు.



తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తూ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గట్టి షాక్ ఇచ్చింది. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అనే పేరును రిజిస్టర్ చేయడం కుదరదని స్పష్టం చేస్తూ ఈసీ అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఈ పేరుపై ప్రజల నుంచి, వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఎలక్షన్ కమిషన్ తన లేఖలో పేర్కొంది. ఈ నేపథ్యంలో రాబోయే పదిహేను రోజుల వ్యవధిలో పార్టీకి సంబంధించి మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని కవితకు సూచించింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా కొత్త పేర్లను ప్రతిపాదించకపోతే.. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం చేసుకున్న దరఖాస్తును పూర్తిగా మూసివేస్తామని ఈసీ స్పష్టం చేసింది.

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అనే పేరును ఎట్టిపరిస్థితుల్లోనూ కొనసాగించేందుకు వీల్లేదని స్పష్టం చేస్తూ ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత ధీటుగా స్పందించారు. ఈసీ లేఖపై స్పందిస్తూ.. తమకు అధికారికంగా ఎన్నికల సంఘం నుంచి వచ్చిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే చట్టబద్ధంగా సమాధానాలు ఇచ్చామని ఆమె వెల్లడించారు. తాము చట్టపరిధిలోనే ఈ పేరును ఎంచుకున్నామని, కాబట్టి కొత్త పేర్లను ఇచ్చే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. ఈసీ ఆదేశాలను సవాల్ చేస్తూ అవసరమైతే ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని కవిత స్పష్టం చేశారు. ఈ పేరు వివాదంతో ప్రస్తుతం ఆమె కొత్త పార్టీ అధికారిక రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి.

భారత రాష్ట్ర సమితి (BRS) అధినేత కేసీఆర్ కుమార్తె కవిత తండ్రితో, బీఆర్ఎస్ పార్టీతో విభేదించి ఇటీవల కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన చారిత్రాత్మక తెలంగాణ రాష్ట్ర సమితి పేరును కేసీఆర్ జాతీయ రాజకీయాల కోసం బీఆర్ఎస్‌గా మార్చిన సంగతి తెలిసిందే. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లకు టీఆర్ఎస్ అనే మూడు అక్షరాల పేరుతో ఉన్న సుదీర్ఘ భావోద్వేగ బంధాన్ని తిరిగి సొంతం చేసుకోవాలనే పక్కా వ్యూహంతోనే కవిత ఈ పేరును ఎంచుకున్నారు. తెలంగాణ సమాజంలో ఇంకా బలంగా ఉన్న పాత టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను, గులాబీ జెండా గుర్తింపును మళ్లీ తన వైపు తిప్పుకోవాలని కవిత భావించారు. ఇందుకోసం 'తెలంగాణ రక్షణ సేన అనే పేరును పెట్టి.. దాని సంక్షిప్త నామం మళ్లీ వచ్చేలా ఆమె ప్లాన్ చేశారు. తద్వారా పాత క్యాడర్‌ను ఆకర్షించడంతో పాటు, భవిష్యత్ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందవచ్చని ఆమె అంచనా వేశారు. కానీ.. ఒకే రకమైన సంక్షిప్త నామాలు, పాత పార్టీల పేర్లను పోలిన గుర్తులు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయనే కారణంతో ఈసీ దీనిపై బ్రేకులు వేసింది. ఇప్పుడు కవిత వెనక్కి తగ్గకుండా కోర్టుకు వెళ్తామని ప్రకటించడంతో ఈ ఇష్యూ ఉత్కంఠగా మారింది.

# రాస్కో కేసీఆర్! భద్రాచలం రాముడిపై ఆన.. పాతాళానికి తొక్కేస్తాం!



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 26కి, అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కి పెరుగుతాయని సీఎం ప్రకటించారు. 36 నెలల ముందుగానే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నట్లు వ్యాఖ్యానించిన ఆయన, "182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. మ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.

**బీఆర్ఎస్ కు బొంద పెట్టారు...** రాజకీయంగా పాలమూరు తనకు ప్రాణమైతే.. ఖమ్మం జిల్లా గుండెకాయ లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరకు ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 2023 జూలైలో పొంగులేటి చేరిక సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలు ఉప్పెనలా వచ్చి బీఆర్ఎస్ కు బొంద పెట్టారని రేవంత్ ఎద్దేవా చేశారు. సరిగ్గా ఇప్పుడు అదే జూలై లో బీఆర్ఎస్ ను మళ్లీ మొలకెత్తనివ్వమని చింతకాని సభకు వేలాదిగా తరలి వచ్చిన మీకు అభినందనలు అంటూ తన ప్రసగించారు. 2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించి... పాపాల భైరవున్ని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారు. జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు. వచ్చే సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు. 2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి . తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26కు పెరుగుతాయి. 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి. 36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా.. 182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. – సీఎం రేవంత్ రెడ్డి

**రాములోరి మీద ఆన భద్రాచలం రాములవారి మీద ఆన...** ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట అంటూ తన స్వరాన్నిపెంచిన సీఎం రేవంత్.. " రాస్కో చంద్ర శేఖర్ రావు... నీ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు గుర్తు పెట్టుకోండి. ఈ మాట కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తాం అంటూ సవాల్ విసిరారు. ప్రతీ సందర్భంలో ప్రజా ప్రభుత్వం రైతులను ఆదుకుంటోందని పేర్కొన్న సీఎం. కేసీఆర్ కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదని.. ఒకే ఇంట్లో రెండు గుంపులున్నాయని విమర్శించారు. ఒకరిపై ఒకరు పోటీగా ఒకాయన కన్నెపల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడని మండిపడ్డారు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఇంత నష్టం జరిగిందన్ని సీఎం.. మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడని చెప్పుకొచ్చారు.

# "కల్యాణలక్ష్మి" అమల్లో కీలక మార్పులు, ఇక నుంచి - మార్గదర్శకాలు..!!



తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమల్లో కీలక మార్పులకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఈ పథకం కింద ఇక నుంచి చెక్కులు కాకుండా నేరుగా అర్హత ఉన్న లబ్దిదారుల ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద నిధులు జమ చేయాలని భావిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక.. ఆమోదం కోసం కొత్త విధానం అందుబాటులోకి తీసుకురానుంది.

తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమల్లో కొత్త విధానం అమలు చేసేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు ఈ పథకాల కింద లబ్దిదారులకు చెక్కుల రూపంలో అందిస్తున్న రూ. 1,00,116 ఆర్థిక సాయాన్ని ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ఆలోచన చేస్తోంది. ఈ రెండు పథకాలకు డీబీటీ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. లబ్దిదారులు తమ దరఖాస్తు ఆన్ లైన్ లో చేసేందుకు వీలుగా కొత్త పోర్టల్ ను తీసుకొస్తోంది. అదే విధంగా ఆమోద ప్రక్రియను ఆన్ లైన్ విధానంలోనూ పూర్తి చేయనుంది. దీని ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న లబ్దిదారులకు వగంగా పథకం నిధులు జమ అయ్యే విధంగా మార్పులు తీసుకొస్తోంది. ప్రస్తుతం ఎమ్మార్వో, ఆర్డీవో స్థాయిలో వెరిఫికేషన్ ఆలస్యం కావడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వం తుది కసరత్తు దీంతో, ఆన్ లైన్ విధానంతో పాటుగా డీబీటి ద్వారా లబ్ధిదారులకు త్వరగా సాయం అందే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏడాదికిపైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఎమ్మార్వో, ఆర్డీవోలకు రోజువారీ బాధ్యతలు, సంక్షేమ పథకాల వ్యవహారాలతోపాటు జనగణన, ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (సర్) వంటి బాధ్యతలూ మీదపడటంతో పని ఒత్తిడి పెరిగిపోతోందని.. పథకాల అమలు పైన సమయం కేటాయించే అవకాశం ఉండటం లేదని చెబుతున్నారు. దీంతో, ఇక నుంచి చెక్కుల విధానంలో కాకుండా లబ్ధిదారుల ఖాతాలోనే నేరుగా సాయాన్ని జమ చేయాలని (డీబీటీ) ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన చేసేందుకు తుది కసరత్తు జరుగుతోంది.

# ఈటెల వ్యూహం ఏమిటీ

కరీంనగర్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఉ ద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉ న్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొనగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజారాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు.



ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై కొంతకాలంగా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే? వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు.అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన.

తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు. ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే? ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు-శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత సంబంధాలు మంచిగా లేవని, ఈటల రాజేందర్ ఎందుకు అన్నారన్నది కాలమే నిర్ణయిస్తుందని అంటున్నారు.

# ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు

## సీఈఓ సుదర్శన్ రెడ్డి

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి కీలక స్పష్టతనిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ వినూత్న సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు పంపిణీ చేసే 'ఎన్యూమరేషన్ పత్రాన్ని' పూర్తిగా నింపి సమర్పిస్తేనే రాబోయే డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటర్ల జాబితాలో పేరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లను గుర్తించి, బోగస్ ఓట్లను తొలగించేందుకు దాదాపు 24 ఏళ్ల తర్వాత (చివరిగా 2002లో జరిగింది) చేపట్టిన ఈ భారీ కసరత్తులో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువులోగా 'ఫామ్-6' ద్వారా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ వంటి ప్రధాన పట్టణ ప్రాంతాల్లో బీఎల్వోలు ఇళ్లకు రావడం లేదని, ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వడం లేదంటూ మీడియా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలపై సీఈఓ సీరియస్‌గా స్పందించారు. బీఎల్వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఫామ్‌లను స్వయంగా అందజేసి, ఓటర్ల వివరాలు సేకరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కరాఖండిగా ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని లోపాలను సరిదిద్దేందుకు పర్యవేక్షకులను రంగంలోకి దించామని, హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ పూర్తి చేసే అవకాశం ఉందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును భద్రపరుచుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.

# మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం




పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్, ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్, ఉద్యోగులు-మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు.

# ఇంటి సమస్యను అధిగమించేది ఎలా....
# కేటీఆర్, కవితకు సేమ్...సీన్

హైదరాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో గులాబీ గూటి పంచాయితీ ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. నిన్నమొన్నటి వరకు కేవలం అంతర్గత విభేదాలుగా భావించిన వ్యవహారం, ఇప్పుడు ఏకంగా పార్టీ మూలాలనే కదిలించే స్థాయికి చేరింది. సొంతంగా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ పెట్టుకున్న కల్వకుంట్ల కవిత, ఇప్పుడు అగ్ర నాయకత్వంపై, ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా చేస్తున్న ఆరోపణలు రాజకీయ గీతల్ని దాటిపోతున్నాయి. నిన్నటి వరకు రాజకీయ విమర్శలకే పరిమితమైన కవిత.. ఈసారి నేరుగా బీఆర్ఎస్ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న పార్టీ ఫండ్, క్విడ్ ప్రో కో వ్యవహారాలను వీధిలోకి లాగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ ను బద్నాం చేయడంలో ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలకంటే కవిత పాత్రే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికార కాలంలో కూడబెట్టిన 1400 కోట్ల నిధులపై కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. తెలంగాణ ప్రజల సొమ్మును గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, దానికి ప్రతిఫలంగా ఆ కాంట్రాక్టర్ల నుండి భారీగా కమిషన్లు వసూలు చేసి బీఆర్ఎస్ పార్టీ ఫండ్గా మార్చారని ఆమె నేరుగానే ఆరోపిస్తున్నారు. సొంత పార్టీ అధినాయకత్వంపైనే, అది కూడా క్విడ్ ప్రో కో కోణంలో ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక మూలాలపై దాడి చేయడం సాధారణ విషయం కాదు. గతంలో కేసీఆర్ అవినీతి రహిత పాలన అందించారని చెప్పుకునే గులాబీ శ్రేణులకు ఇప్పుడు ఈ ఆరోపణలు మింగుడుపడటం లేదు. గతంలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఒక సొంత విమానాన్ని కొనుగోలు చేసిందనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఆ వివాదం అలా ఉంచితే, తాజాగా జాతీయ ఆంగ్ల దినపత్రిక 'ది పయనీర్' ను కూడా పార్టీ నిధులతోనే కొనుగోలు చేశారంటూ కవిత సరికొత్త బాంబు పేల్చారు. తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసి.. వందల కోట్ల పార్టీ ధనాన్ని వాడుకుంటూ కేటీఆర్ తన సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నారని, మీడియా సంస్థలను చేతుల్లోకి తీసుకుని బలపడుతున్నారనే ఆవేదన, ఆగ్రహం కవిత మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో కవిత 'తెలంగాణ రక్షణ సేన' అని పేరుతో పార్టీ పెట్టుకున్నారు. కానీ కేటీఆర్ ఆ పేరు రాకుండా పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారని కవిత నమ్ముతున్నారు. తెలంగాణ సెంటిమెంట్ బలాన్ని తాను పొందేందుకు, గ్రౌండ్ లెవెల్లో క్యాడర్ను సమీకరించుకునేందుకు తాను కొత్తగా టీఆర్ఎస్ పేరుతో పొలిటికల్ ప్లాట్ఫారమ్ను పునరుద్ధరించాలని చేస్తున్న ప్రయత్నాలను కేటీఆర్ తీవ్రంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ పేరును తానే రిజిస్టర్ చేయించుకుని కవితకు చెక్ పెట్టాలని కేటీఆర్ చూడటంతో ఆమెలో అసహనం కట్టలు తెంచుకుంది. అటు సెంటిమెంట్ పేరు దక్కకపోవడంతో.. నైతికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు, సొంత కుటుంబ సభ్యులు.. అదీ మాజీ ముఖ్యమంత్రి కూతురు చేసే ఆరోపణలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్నా రాని మైలేజ్, ఇప్పుడు కవిత చేసిన వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్ వ్యతిరేక పార్టీలకు సులువుగా దొరికింది. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడానికి ఇంతకంటే బలమైన అస్త్రం ప్రత్యర్థులకు దొరకదు. కవిత చేసిన ఈ క్విడ్ ప్రో కో, 1400 కోట్ల కమిషన్ల ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీని నైతికంగా కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది.

# రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులపై బిగ్ అప్‌డేట్.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణకు సంబంధించిన కీలక రహదారి ప్రాజెక్టులపై చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి వెంటనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని.. దక్షిణ భాగానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్.. మంచిర్యాల-హైదరాబాద్ నేషనల్ హైవేకి కూడా కేంద్ర సహకారం కోరారు. ఇవి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, రవాణా, పారిశ్రామిక రంగాలకు కీలకమని పేర్కొన్నారు. తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి వేగం పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగానే కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, మంచిర్యాల-హైదరాబాద్ జాతీయ రహదారి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులపై రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తి అయిందని నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ వివరించారు. వెంటనే కేంద్ర కేబినెట్ ఆమోదం మంజూరు చేసి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి కూడా వెంటనే అనుమతులు ఇచ్చి భూసేకరణ ప్రారంభించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభమైతే నిర్మాణం వేగంగా పూర్తి కావడంతో పాటు వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి అవసరమైన అనుమతులు త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి గడ్కరీని కోరారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మిస్తే హైదరాబాద్-విజయవాడ మధ్య దూరం సుమారు 100 కిలోమీటర్లు తగ్గుతుందని.. దీనివల్ల మరింత వేగంగా సరకు రవాణా జరుగుతుందని తెలిపారు. ఈ హైవే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు.. మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అటవీ శాఖ అనుమతులను కేంద్ర ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, జలాశయాల పరిధిలో ఈ ప్రాజెక్టు ఉండటంతో కేంద్రం సహకారం అవసరమని తెలిపారు. అదే సమయంలో రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు 6 లేన్ల నేషనల్ హైవేను మంజూరు చేయాలని.. ఈ ప్రాజెక్టు భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని తెలిపారు. ఈ హైవే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు పెద్ద ఎత్తున ఉపయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

# 3 వారాల్లో వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. 3 వారాల్లోగా మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. భూవివాదాలు పరిష్కారమైన వెంటనే ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 2028 జూన్ 2 నాటికి ఈ రెండు విమానాశ్రయాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో విమానయాన రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు వేగవంతం చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిసి వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి.. భూసేకరణ, నిర్మాణ పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాంతీయ విమాన అనుసంధానాన్ని పెంచడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఈ 2 విమానాశ్రయాలు కీలకంగా మారనున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.. వరంగల్ ఎయిర్‌పోర్టు భూసేకరణలో తెలంగాణ సర్కార్ చొరవ చూపిందని తెలిపారు. మరో 3 వారాల్లో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన 2028 జూన్ 2వ తేదీ నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టును పూర్తి చేసి ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని.. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు విషయానికి వస్తే.. అక్కడ రక్షణ శాఖకు చెందిన భూముల అంశం పరిష్కారమైన వెంటనే భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తెలంగాణలో మరిన్ని ఎయిర్‌పోర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని..




ప్రాంతీయ కనెక్టివిటీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ.. జీడీపీలో దాదాపు 5 శాతం వాటా కలిగి ఉండటం తెలంగాణ ఆర్థిక బలాన్ని సూచిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే తెలంగాణలో ప్రపంచ స్థాయి విమానాశ్రయాల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. ఇక వరంగల్ ఎయిర్‌పోర్టు రూపకల్పనలో కాకతీయుల వైభవం, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్ రూపొందిస్తున్నామని తెలిపారు. ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులను నిర్మించడం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని సీఎం వెల్లడించారు.

# ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

## మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,జనమసయం విలేకరి: జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు. బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల 41 వేల 150



రూపాయలు విడుదల. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారుల సమన్వయం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభంజూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం,21న అమ్మవారికళ్యాణం, 22 న రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు,ఆగస్టు 3న రంగం కార్యక్రమంఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్బెండాజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కిశోరులకు సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్ర ఇవ్వడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన 2,46,177 మంది ప్రతి చిన్నారులకు , ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.



తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. జూలై 20న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జె.వెంకటి, ప్రోగామ్ అధికారి డాక్టర్.రోహిత్ కుమార్,కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపాలిటీ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, స్థానిక కౌన్సిలర్ అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, ఎంఈఓ ఎల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వై. మాధవి, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్ళపల్లికి దక్కిన అరుదైన గౌరవం

**గిన్నిస్ బుక్ వరల్డ్ రివార్డ్ లో గోల్డ్ మెడల్ సాధించిన రిత్విక్ తేజాతో పాటు మరో ముగ్గురుచిన్నారులను అభినందించి క్యాష్ రివార్డ్ ను అందజేసిన మంత్రి కొండా సురేఖ.**




జయశంకర్ భూపాలపల్లి.: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి అరుదైన గౌరవం దక్కింది. అతి చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ రంగంలో తెలుగు రాష్ట్రాల కీర్తిని, భారతదేశ ప్రతిష్టతను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి, గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ లోకి ప్రవేశించి..గోల్డ్ మెడల్ సాధించి..పలువురి ప్రముఖులచే అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మూగ రాజ్ కుమార్ తనయుడు మూగ రిత్విక్ తేజాను, మరియు వరల్డ్ రికార్డ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో ముగ్గురి చిన్నారులను తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. కంప్యూటర్ యుగంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్న అతి చిన్న వయసు పిల్లలను చూసి మంత్రి సురేఖ సంబరపడ్డారు. అదేవిధంగా చిన్నారులు మారుమూల ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా నలుగురి చిన్నారులకు క్యాష్ రివార్డ్ అందజేశారు. అలాగే అటు చదువులో ఇటు మార్షల్స్ రంగంలో తనదైన ముద్ర వేసేలా ప్రోత్సహిస్తున్న రిత్విక్ తేజా తండ్రి, ఏఆర్ కానిస్టేబుల్ రాజకుమార్ ను మంత్రి సురేఖ, బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ లు అభినందించారు. అనంతరం మంత్రి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని, వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా దృష్టి సారించాలని, నేటి విద్యార్థుల భవిష్యత్తే..రేపటి తెలంగాణ అభివృద్ధికి పునాదులు కావాలని, ఆ విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.

# 15. 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్

హైదరాబాద్ : స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి.



ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు.యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి. ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది. ”బయోమెట్రిక్ విధానానికి పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, యూపీఐ వినియోగదారులు సులభమైన, వేగవంతమైన పేమెంట్ అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది. జూన్ నెలలోనే రికార్డు స్థాయిలో 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం విశేషం. రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐతో సహా అన్ని రకాల చెల్లింపుల్లోనూ ఈ విధానానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ కస్టమర్లకు బయోమెట్రిక్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ఈ పద్ధతిని ఎంచుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాము” అని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా అన్నారు.స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ లాక్ వాడటం ద్వారా, వినియోగదారులకు యూపీఐ పిన్ గుర్తుపెట్టుకోవాల్సిన లేదా ఎంటర్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది లావాదేవీలను చాలా వేగంగా పూర్తి చేయడమే కాకుండా, పేమెంట్లు ఫెయిల్ అవ్వకుండా సక్సెస్ రేటును పెంచుతుంది.వివిధ బ్యాంకులు, యూపీఐ యాప్‌లలో ఈ సదుపాయం విస్తరిస్తుండటంతో, భారతీయుల రోజువారీ చెల్లింపుల శైలిలో బయోమెట్రిక్ కీలక పాత్ర పోషించనుంది. రాబోయే నెలల్లో కూడా ఈ ఫీచర్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని ఎన్‌పీసీఐ ఆశిస్తోంది. ఇది సురక్షితమైన, ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది

# అల్లు అర్జున్ పొలిటికల్ పార్టీ ప్రచారం...

హైదరాబాద్, సోషల్ మీడియా సమాజానికి ఎంత ఉపయోగపడుతోందో, అంతకంటే వేగంగా పనిలేని వారి ఊహా ప్రపంచం గా మారిపోతోంది. ముఖ్యంగా గత రెండు, మూడు రోజులుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను టార్గెట్ చేస్తూ సాగుతున్న రాజకీయ ప్రచారం చూస్తుంటే.. అసలు తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న విషయమో, లేదా ఒకరి ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నానన్న విషయమో కనీసం అల్లు అర్జున్‌కైనా తెలుసా? అనే అనుమానం రాక మానదు. రాజకీయాల్లో ఉన్న స్నేహితులతో లేదా బంధువులతో ఉండే వ్యక్తిగత అనుబంధాలతో ఒకరిద్దరితో దిగిన ఫోటోలనో, పర్యటనలనో బేస్ చేసుకుని కథలు అల్లేయడం డిజిటల్ మీడియాలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తన దృష్టిని పూర్తిగా పాన్-ఇండియా కెరీర్ మీదే కేంద్రీకరించిన ఒక టాప్ హీరోను బలవంతంగా రాజకీయాల్లోకి లాగడం వెనుక సోషల్ మీడియా అల్గారిథమ్స్, వ్యూస్ వేట తప్ప మరోటి కనిపించడం లేదు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న ప్రచారాల్లో ప్రధానంగా మూడు సిల్లీ థియరీలు వినిపిస్తున్నాయి. మొదటిది.. అల్లు అర్జున్ ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో రహస్య చర్చలు జరిపారని, ఒక పక్కా పొలిటికల్ స్కెచ్ సిద్ధం చేసుకుంటున్నారని కొందరు రాసుకొస్తున్నారు. మరికొందరైతే ఒక అడుగు ముందుకు వేసి.. తమిళనాడులో దళపతి విజయ్ తరహాలోనే, బన్నీ కూడా తన మామ చంద్రశేఖర్ రెడ్డి వ్యూహాలతో, పుష్ప సినిమాలలో అరెస్టుతో అవమానించిన రేవంత్ రెడ్డిని కాదని లంగాణలో కొత్త పార్టీ పెట్టి సీఎం అయిపోతారని గాల్లో మేడలు కడుతున్నారు. ఇంకొక వర్గం.. ఏపీలో జగన్ రెడ్డి ప్లాన్ ప్రకారమే అల్లు అర్జున్ అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తులో అక్కడ చక్రం తిప్పుతారని సరికొత్త స్క్రిప్ట్ వండి వారుస్తున్నారు.దక్షిణాదిలో సినిమాలకు, రాజకీయాలకు విడదీయరాని బంధం ఉందనేది నిజమే. ఎన్టీఆర్, ఎంజీఆర్ లీగసీ నుంచి నిన్నటి పవన్ కల్యాణ్, నేటి విజయ్‌ వరకు వెండితెర ఇమేజ్‌తో రాజకీయాల్లో సక్సెస్ అయిన వారు ఉన్నారు. అయితే, ఒక నటుడు రాజకీయాల్లోకి రావాలా వద్దా అనేది అతని వ్యక్తిగత, సిద్ధాంతపరమైన నిర్ణయం. అల్లు అర్జున్ గతంలోనే తాను రాజకీయాలకు న్యూట్రల్ అని, తనకు అన్ని పార్టీల్లోనూ స్నేహితులు ఉన్నారని స్పష్టం చేశారు. కేవలం గతంలో నంద్యాల పర్యటన లేదా హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను బూతద్దంలో చూపిస్తూ.. ఆయనపై రాజకీయ ముద్ర వేయాలని చూడటం సరికాదు. పుష్ప-2 రికార్డుల ప్రభంజనం తర్వాత బాలీవుడ్, టాలీవుడ్‌లలో అత్యంత క్రేజ్ ఉన్న హీరోగా, వందల కోట్ల మార్కెట్ ఉన్న గ్లోబల్ స్టార్‌గా కెరీర్ పీక్స్‌లో ఉన్న బన్నీ.. ఇప్పుడప్పుడే సినిమాలు వదిలేసి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ అనుకోరు.ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు, రాజకీయాల్లోకి వచ్చే అర్హత ఉన్నాయి. ఒకవేళ అల్లు అర్జున్ భవిష్యత్తులో నిజంగానే ప్రజాసేవ వైపు రావాలనుకుంటే.. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా, ధైర్యంగా లౌడ్‌గా అనౌన్స్ చేస్తారు. అంతేకాని, యూట్యూబ్ థంబ్‌నైల్స్ కోసమో, సోషల్ మీడియాలో ట్రెండింగ్ కోసమో పనిగట్టుకుని రాసే కథనాలు పరోక్షంగా ఒక నటుడి క్యారెక్టర్ అస్సాసినేషన్‌కు దారితీస్తాయి.



# బేగంపేట్ అనే పేరు రావడానికి కారణం







బేగంపేట్ అనే పేరు రావడానికి కారణం నిజాం రాజు కూతురు బషీర్ ఉన్నిసా బేగం కు ఈ భూమిని పెళ్లి కానుకగా ఇవ్వడం , ఆ తరువాత ఆమె ఆ భూమిని బేగంపేట్ విమానాశ్రయ నిర్మాణం కోసం ఆ భూమి ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసింది , బేగంపేట విమానాశ్రయం నిర్మాణం వెనక నిజాం రాజు కోడలు శ్రీమతి దుర్రాషివర్ ప్రోత్బలం ఎంతో ఉంది ఆమెనే ఈ ఎయిర్పోర్టుకు పునాది రాయి వేసింది , ఇది ఆ సమయంలో అత్యాధునిక విమానాల నడిపే విమానాశ్రయాలలో ఒకటి , ఆ రోజుల్లో దీని రన్ వే అలాగే ఫ్లైట్ హ్యాంగర్స్ ప్రపంచం లో అతీ పెద్దవి , మొన్నటి దాకా ఒక హ్యాంగర్ గౌలిగూడలో బస్ స్టాండ్ గా ఉండేది అప్పట్లో రెండు కమర్షియల్ ప్యాసింజర్ ఎయిర్పోర్ట్ లు ఉండేవి ఒకటి హకీంపేట్ ఇంకొకటి బేగంపేట్ , రెండిటి మీద రాకపోకలు జరిగేవి, అందరు అనుకున్నట్టు హైదరాబాద్ లో ఒక్క ఎయిర్పోర్ట్ కాదు హైదరాబాద్ లో రెండు ఎయిర్పోర్ట్ లు ఉండేవి , ఇక నిజాం రాజు స్థాపించిన దక్కన్ ఎయిర్వేస్ తో టాటా గ్రూప్ పార్ట్నర్ గా ఏర్పడి కమర్షియల్ ఆపరేషన్స్ మొదలుపెట్టారు , బేగంపేట్ ఏర్పోర్ట్ కు మొదట్లో నాలుగు అప్రోచ్ రోడ్లు ఉండేవి ఇప్పుడున్న ప్రకాష్ నగర్ మెయిన్ ఎంట్రెన్స్ ఆ రోజుల్లో కార్గో టర్మినల్ కు దారి అప్పుడు ఏర్పోర్ట్ స్టాఫ్ కోసం నిర్మించిన భవనాలలోనే ప్రస్తుతం ఏర్పోర్ట్ స్టేషన్ ఉంది ఇందులోనే రాజీవ్ గాంధీ గారు పైలెట్ గా ట్రైనింగ్ తీసుకున్నారు కొంత భాగం రోనాల్డ్ రాస్ ఇన్స్టిట్యూట్ కు ఇచ్చారు ఔత్సాహిక పైలెట్ల కోసం 1936 లో హైదరాబాద్ Aero Club ఏర్పడింది. ఆ తర్వాత సంవత్సరం ఏర్ షో చేసారు , శ్రీమతి దుర్రాషివర్ ప్రవేశపెట్టిన స్టూడెంట్ పైలెట్ లైసెన్స్ ఇప్పటికీ దేశవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంది , ఇందులో భాగంగానే దేశంలోని మొదటి మహిళా పైలట్ అయినటువంటి సర్ల తకరాల్ కు లైసెన్స్ ఇక్కడే ఇచ్చారు , ఇంకా దీని గురించి రాయడానికి చాలా ఉంది , ప్రపంచ ప్రసిద్ధి చెందిన బేగంపేట్ ఏర్పోర్ట్ నిర్మాణం వెనుక ఎంతో చరిత్ర ఉంది బేగంపేట్ ఎయిర్పోర్టులో ఎక్కడ నిజాం రాజు పేరు రాలేదు దురదృష్టవశాత్తు ఎన్నో విద్యాసంస్థలు నిర్మించి ఎంతో ఆధునికంగా ఆలోచించి ఎయిర్పోర్ట్ నిర్మాణానికి ఆలోచన చేసిన శ్రీమతి దుర్రాషివర్ గురించి ఎవరికి తెలియదు కానీ , విమానాశ్రయ టర్మినల్ కు మాత్రం ఎన్టీఆర్ పేరు పెట్టారు ఆయన పేరు పెడితే తప్పులేదు కానీ దాన్ని నిర్మించిన వారిని విస్మరించడం మాత్రం తప్పు , ఇప్పటికైనా మనం సోయలోకి వచ్చి రజాకారులు వేరు నిజాం రాజ్యం వేరు అనే విషయాన్ని ప్రపంచానికి తెలియజేయాలి.

# ఓవైసీని భయపెడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

హైదరాబాద్,: మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన, దశాబ్దాలుగా పాతబస్తీని తమ రాజకీయ సామ్రాజ్యంగా ఏలుతున్న మజ్లిస్ పార్టీకి, ముఖ్యంగా ఓవైసీ కుటుంబానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షేత్రస్థాయిలో నకిలీ ఓట్లు, అక్రమ ఓట్ల వ్యవహారం ఈ ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి రాబోతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జోరందుకుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి పాతబస్తీ నియోజకవర్గాల్లో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45శాతం నుండి 50శాతం లోపే ఉండటానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలేనని ఈ నిరంతర తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో బూత్ లెవెల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓట్లు నమోదు చేసేవారు. దీనివల్ల ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా జాబితాలో అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కఠినమైన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'లో అధికారులు పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ వంటి పక్కా లీగల్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పాతబస్తీలో తరతరాలుగా నివసిస్తున్న మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, సరైన పత్రాలు లేని పాత ఇళ్లలోనో ఉంటుండటంతో ఈ పత్రాలు చూపించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి పాతబస్తీలో భారీ సంఖ్యలో బోగస్, బల్క్ ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ సంక్షోభం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదయ్యే లాయల్ ఓట్ బ్యాంక్, బల్క్ ఓటింగ్ ఆధారంగానే అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తూ వస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రక్షాళన వల్ల లక్షలాది ఓట్లు తొలగిపోతే, ఎంఐఎం సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఛిన్నాభిన్నమవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఓటర్ల జాబితాలో నకిలీలు ఏరివేస్తే, ఓవైసీ కుటుంబానికి పాతబస్తీపై ఉన్న తిరుగులేని రాజకీయ పట్టు సడలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. తమ రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ని ఉపయోగించి, కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జారీ చేస్తున్నట్లుగా, ఇక్కడి ఓటర్లకు కూడా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఓవైసీ డిమాండ్ చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి ఈ శాశ్వత నివాస ధృవీకరణ డిమాండ్‌పై అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం కావడంతో, ఎంఐఎం అడిగినట్లు హడావుడిగా శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఏదేమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఓవైసీ మార్క్ ఏకపక్షాధిపత్యానికి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

# కాళేశ్వరం పై బీజేపీ కిం కర్తవ్యం...



హైదరాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ఒకవైపు కేంద్రంలోని తమ ప్రభుత్వ పరిధిలోని సంస్థ ఇచ్చిన నివేదికకు భిన్నంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడుతుండడం, మరోవైపు దీనిని అధికార కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుని విమర్శలు గుప్పించడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయం వేడెక్కింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి పరిశీలనలు జరిపింది. ప్రస్తుతానికి మేడిగడ్డ వద్ద నీటిని నిలపవద్దని, అలా చేస్తే బ్యారేజీ నిర్మాణానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టమైన సిఫారసు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ సంస్థ పనిచేస్తోంది.అయితే, విచిత్రంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఇందుకు భిన్నమైన డిమాండ్లను తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగంగానే స్పందిస్తూ.. కాళేశ్వరంలో నీటిని నింపి, ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సైతం కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. కేంద్ర సంస్థ చెప్పినదానికి భిన్నంగా, రాష్ట్ర బీజేపీ నేతలు నీటిని నింపాలని కోరడం వెనుక ఉన్న వ్యూహం ఏంటో అర్థం కాక ఆ పార్టీ శ్రేణులే గందరగోళానికి గురవుతున్నారు.రాష్ట్ర బీజేపీ నేతల విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతే దీటుగా స్పందిస్తోంది. తాము సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్డీఎస్ఏ సిఫారసులనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఒకవేళ ఎన్డీఎస్ఏ నివేదికను కాదని నీటిని నిలిపితే, భవిష్యత్తులో బ్యారేజీకి ఏమైనా నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కేంద్ర సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లేనిపోని సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం వివరిస్తోంది. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ గందరగోళాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా వాడుకుంటోంది. బీఆర్ఎస్ చెప్పినట్లే బీజేపీ నేతలు ఆడుతున్నారంటూ కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, వైఫల్యాలపై బీఆర్ఎస్ తీరును గతంలో తప్పుబట్టిన బీజేపీ, ఇప్పుడు అదే బీఆర్ఎస్ లైన్‌ను ఎందుకు అందుకుందని ప్రశ్నిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే ఈటల రాజేందర్ నడుచుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత అవగాహన కుదిరిందనే అనుమానాలకు ఈ వైఖరే నిదర్శనమని కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.వాస్తవానికి కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని గతంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే క్రమంలో, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు కేంద్ర సంస్థ నీళ్లు నిలపొద్దంటుంటే, మరోవైపు రాష్ట్ర నేతలు నీళ్లు నింపాలనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# భారతీయ నేపథ్య గొంతు మూగబోయింది

ఎస్.జానకి (1938 ఏప్రిల్ 23,- 2026 జులై 11) గా అందరికి పరిచయమైన శిష్ట శ్రీరామ మూర్తి జానకి భారతీయ నేపథ్య గాయని.



జానకి తన 60 సంవత్సరాల పైన సినీ జీవితంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడింది. వీటిల కన్నడ భాషలో పాడినవే ఎక్కువ. ఆమె ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారం 4 సార్లు, వివిధ రాష్ట్రాల నుంచి 31 సార్లు పొందింది. ఇళయరాజా సంగీత దర్శకత్వంలో పాడిన పాటలు, ఎస్ పి బాలసుబ్రహ్మణ్యంతో కలసి పాడిన పాటలు ఎంతో ప్రసిద్ధి. మైసూరు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. తమిళనాడు ప్రభుత్వం కళైమామణి పురస్కారం పొందారు. దక్షిణ భారత కళాకారులకు సరియైన గుర్తింపు లభించడం లేదు అని 2013 లో భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మ భూషణ్ పురస్కారాన్ని తిరస్కరించారు. 1957లో విధియిన్ విలయాట్టు అనే తమిళ సినిమాతో తన కెరీర్ ను ప్రారంభించిన జానకి సెప్టెంబరు 2016న తాను పాడటం ఆపేస్తున్నట్లు ప్రకటించారు. ౪2౭

**జననం , బాల్యం**

జానకి 1938 ఏప్రిల్ గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకా, పల్లపట్ల గ్రామంలో శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జన్మించింది. జానకి తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయుడు, ఆయుర్వేద వైద్యుడు. ఉద్యోగ రీత్యా ఈయన కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవాడు. చిన్నతనం నుంచి జానకి సంగీతం పట్ల ఎంతో మక్కువ చూపేది. తన మూడవ ఏట నుంచే అనేక కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలు పెట్టింది. ఉద్దండులైన సంగీత విద్వాంసుల వద్ద శిష్యరికం చేసింది. బాల్యంలోనే సినీ సంగీతంపై ఆకర్షితురాలయ్యింది. లతా మంగేష్కర్, పి.సుశీల, జిక్కి, పి.లీల పాడిన పాటలు తన కార్యక్రమాల్లో పాడతూ ఉండేది. నాదస్వరం విద్వాన్ పైడిస్వామి వద్ద సంగీతం నేర్చుకున్న జానకి తన 19వ ఏట మామయ్య సలహా మేరకు, చెన్నైలోని ఏవిఎమ్ స్టూడియోలో పాడటం ఆరంభించింది. దాంతో ఆమె మకాం చెన్నైకి మారింది.

**గాయనిగా తొలినాళ్ళు**

తొలినాళ్లలో ఏవీయం స్టూడియో గాయనిగా ఉండి, 1957లో టి.చలపతిరావు సంగీత దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం విధియిన్ విలాయత్తులో తన గాత్రాన్ని అందించడంలో సినీ ప్రస్థానం మొదలయ్యింది. ఎమ్మెల్యే చిత్రం ద్వారా తెలుగు వారికి దగ్గరయింది. ఈ చిత్రంలో తన పాట ఎంతో పేరు తెచ్చిపెట్టింది. అలా మొదలైన ఆమె గానం ఎన్నో మలుపులు తిరుగుతూ దినదిన

ప్రవర్ధమానంగా సాగుతూ ఆబాలగోపాలాన్నీ అలరింపజేసింది. తెలుగులో విజయవంతము అయిన ఎన్నో చిత్రాలకు పాటలు పాడింది. 1957వ సంవత్సరంలో తన



కెరీర్‌ను ప్రారంభించిన జానకి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ మున్నగు అనేక భారతీయ భాషలలో పాటలు పాడినది. జానకి పాటల రచయిత, కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసురాలు, సంగీత దర్శకురాలు కూడా. కృష్ణుని, షిర్డీ సాయిబాబా భక్తురాలైన ఆమె చాలా సమయము పూజలలో గడుపుతుంది. అంతేకాక మీరా పై అనేక భక్తిగీతాల క్యాసెట్ల రికార్డు చేసి విడుదల చేసింది. ఉషా కిరణ్ మూవీస్ వారి మౌన పోరాటం చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి, భానుమతి, లీల తర్వాత మూడో మహిళా సంగీత దర్శకురాలిగా పేరు గడించింది. పాటల్లో మిమిక్రి మిక్స్ చేసి సంగీతప్రపంచాన్ని ఇలా కూడా మెప్పించింది. పదహారేళ్ళ వయసు చిత్రంలోని కట్టుకథలు చెప్పి నేను కవ్విస్తే పాటలో పండు ముసలావిడ గొంతు, గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన పాటలో చిన్న పిల్లాడి గొంతు, పెద్ద వాళ్ళ స్వరం, చిన్నారి పొన్నారి కిట్టయ్య పాటలో పిల్లాడి గొంతు, శ్రీవారి శోభనం చిత్రంలోని అలకపానుపు ఎక్కనేల చిలిపి గోరింక




పాటలో హీరోయిన్ బొమ్మ గొంతులతో పాట మొదలైనవి ఆమె గొంతులోని వైవిధ్యానికి ఉదాహరణలు. మేఘమా దేహమా పాటలో ఆమె గొంతు పలికిన ఆర్ద్రత, ఆకాశం ఏనాటిదో అనురాగం ఆనాటిది అంటూ సాగే పాటలో ఆమె స్వరం పలికిన ప్రేమ తత్వం, వెన్నెల్లో గోదావరి అందం పాటలో ఆమె గొంతులో పలికించిన ఆవేదన, తొలిసారి మిమ్మల్ని చూసిందీ అంటూ సాగే పాటలో ఆమె స్వరంలో ప్రతిఫలించిన అల్లరి ఆమె భావ వైవిధ్యానికి తార్కాణాలు. అలనాటి జమున నుంచి నిన్నమొన్నటి హీరోయిన్ల వరకూ ఐదు తరాల హీరోయిన్లకి ఆలంబన అయింది. తెరముందు కనిపించే హీరోయిన్లకి ఆమె స్వరం అతికినట్టు సరిపోతుంది. ఆమె 55 ఏళ్ళ సుదీర్ఘకాలం పాటు సుమారు ఐదారు తరాల కథానాయికలకి అన్ని రకాల భావాలనూ స్పష్టంగా వ్యక్తీకరిస్తూ నేపథ్యగానం చేసింది. వయసు మీదపడినా ఆ ప్రభావం గొంతుమీద పడనివ్వకపోవడం ఆమె గానశైలి. మధురమైన సంగీతం, తిరుగులేని స్వరసంపదతో జానకి కెరీర్ ఎదురులేకుండా సాగింది. వేలకొద్దీ పాటలు పాడింది జానకి. హిందీ, సింహళం, బెంగాలి, ఒరియా, ఇంగ్లీషు, సంస్కృతం, తుళు, సౌరాష్ట్ర, జపనీస్, జర్మన్ భాషలు తెలిసిన జానకి, ఘంటసాల, డాక్టర్ రాజ్‌కుమార్, వాణి జయరాం, కె.జె. జేసుదాస్, ఎల్.ఆర్. ఈశ్వరి, పి. జయచంద్రన్, పి.లీలా, కె.ఎస్. చిత్ర, సుజాత, జెన్సీ, పి.బి. శ్రీనివాస్, ఇళయరాజా, ఎస్.బి. బాలసుబ్రహ్మణ్యం వంటి పలువురు ప్రముఖ గాయకులతో పనిచేసింది.

# కాళేశ్వరంపై రాజకీయ చర్చ



తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారింది. వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడం, సాగునీరు మరియు తాగునీటి అవసరాలు పెరుగుతుండటం వంటి పరిణామాల మధ్య కాళేశ్వరం పంపులను ఎందుకు పూర్తిస్థాయిలో నడపడం లేదన్న ప్రశ్న ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ఒకవైపు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సాంకేతిక, ఆర్థిక, భద్రతా కోణాల్లో చూస్తున్నామని చెబుతుంటే, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఇది రాజకీయ ఉద్దేశాలతో తీసుకున్న నిర్ణయమని ఆరోపిస్తోంది. ఈ రెండు వాదనల మధ్య అసలు సమస్య ఏమిటి, ప్రజలకు నిజంగా ఏం అవసరం, ప్రాజెక్టు భవిష్యత్తు ఏ దిశగా సాగాలి అనే ప్రశ్నలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట తెలంగాణలోని అనేక జిల్లాలకు జీవనాధారంగా భావించబడుతోంది. గోదావరి నదిపై ఆధారపడి నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా రాష్ట్రంలోని ఎండాకాల అవసరాలను తీర్చడం, సాగునీటి కొరతను తగ్గించడం, తాగునీటి సరఫరాను స్థిరీకరించడం వంటి లక్ష్యాలు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి దీనిపై అనేక ఆశలు, అంచనాలు, విమర్శలు, ప్రశంసలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం నీటి లభ్యత, పంపింగ్ సామర్థ్యం, నిర్వహణ వ్యయం, సాంకేతిక లోపాలు వంటి అంశాలు మళ్లీ చర్చకు రావడంతో, కాళేశ్వరం కేవలం ఒక ఇంజినీరింగ్ ప్రాజెక్టుగా కాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల సమ్మేళనంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ నాయకులు ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తున్నారు. వారి వాదన ప్రకారం, రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి అవసరాలు పెరుగుతున్న సమయంలో కాళేశ్వరం పంపులను పూర్తిస్థాయిలో వినియోగించక పోవడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు జీవనాడి అని, దాన్ని సమర్థంగా నడిపితే అనేక రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగేవని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తగ్గేవని వారు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యం మరింత పెరుగుతుందని, అలాంటి సమయంలో పంపులను ఆపివేయడం లేదా పరిమితంగా నడపడం రైతులకు నష్టం కలిగిస్తుందని బీఆర్ఎస్

అభిప్రాయపడుతోంది. బీఆర్ఎస్ నాయకుల దృష్టిలో, ప్రభుత్వం ఈ అంశాన్ని సాంకేతిక అవసరంగా కాకుండా రాజకీయ కోణంలో చూస్తోందన్న అనుమానం బలంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని, దాని సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించకుండా ప్రజల్లో అసంతృప్తి పెంచే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. కేటీఆర్ వ్యాఖ్యల ప్రకారం, రాజకీయ విభేదాలు ఎంత ఉన్నా ప్రజల అవసరాలు ముందు రావాలని, నీటి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు, గ్రామాలు, పట్టణాల కోసం కాళేశ్వరం పంపులను నిరంతరం నడపాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయన మాటల్లో, ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన ప్రాజెక్టు కాదు, తెలంగాణ ప్రజల భవిష్యత్తుతో ముడిపడిన వ్యవస్థ అని బీఆర్ఎస్ భావిస్తోంది.

ఈ వాదనలో ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, నీటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయ నిర్ణయాలు ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. ఒక పంపు ఆగిపోతే అది కేవలం యంత్రం ఆగినట్టే కనిపించవచ్చు, కానీ దాని ప్రభావం వేలాది ఎకరాల పంటలపై, గ్రామాల తాగునీటి సరఫరాపై, పశువుల నీటి అవసరాలపై, చివరికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. అందుకే బీఆర్ఎస్ ఈ అంశాన్ని భావోద్వేగంగా కాకుండా ప్రజా ప్రయోజనాల కోణంలో చూస్తున్నామని చెబుతోంది. వారి అభిప్రాయం ప్రకారం, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును రాజకీయ విమర్శలతో కాకుండా సమర్థవంతమైన నిర్వహణతో ముందుకు తీసుకెళ్లాలి.

ఇక కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ అంశాన్ని పూర్తిగా భిన్నంగా వివరిస్తోంది. ప్రభుత్వ వాదన ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్టులోని కొన్ని బ్యారేజీలు, పంపింగ్ వ్యవస్థలు, అనుబంధ నిర్మాణాల్లో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పంపులను నిరంతరం నడపడం సరైన నిర్ణయం కాదని చెబుతోంది. భారీ విద్యుత్ వినియోగం, నిర్వహణ ఖర్చులు, నీటి లభ్యత, నిర్మాణ భద్రత వంటి అంశాలు కూడా నిర్ణయ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అందువల్ల అవసరాన్ని బట్టి, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు మాత్రమే పంపులను నడుపుతున్నామని అధికారులు వివరిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిలో, నీటి ప్రాజెక్టు నిర్వహణ అనేది కేవలం రాజకీయ సంకల్పంతో జరిగే పని కాదు. అది ఇంజినీరింగ్ ప్రమాణాలు, భద్రతా నియమాలు, ఆర్థిక సామర్థ్యం, దీర్ఘకాలిక స్థిరత్వం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఏదైనా సాంకేతిక లోపం ఉన్నప్పుడు దాన్ని నిర్లక్ష్యం చేసి పంపులను నడపడం వల్ల మరింత పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని, ప్రజల భద్రతను, ప్రాజెక్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

ప్రభుత్వ వాదనలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక భారం. కాళేశ్వరం వంటి ఎత్తిపోతల పథకాన్ని నడపడానికి భారీగా విద్యుత్ అవసరం అవుతుంది. పంపులను ఎక్కువసేపు నడిపితే విద్యుత్ ఖర్చులు పెరుగుతాయి, నిర్వహణ వ్యయం అధికమవుతుంది, రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెరుగుతుంది. అందువల్ల నీటి అవసరం, లభ్యత, ఖర్చు, భద్రత అన్నింటినీ సమతుల్యం చేస్తూ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం అంటోంది. ఈ నేపథ్యంలో, రాజకీయ విమర్శల కంటే సాంకేతిక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలే ప్రాధాన్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

అయితే ఈ వాదన ప్రజల్లో పూర్తిగా నమ్మకం కలిగించిందా లేదా అన్నది వేరే ప్రశ్న. ఎందుకంటే సాధారణ ప్రజలకు సాంకేతిక వివరాల కంటే తమ గ్రామానికి నీరు వస్తుందా లేదా, పంటలు ఎండిపోతాయా లేదా, తాగునీటి ట్యాంకర్లు వస్తాయా లేదా అన్నదే ముఖ్యంగా కనిపిస్తుంది.

ప్రభుత్వం ఎంతవరకు సాంకేతిక కారణాలు చెబుతున్నా, నీటి కొరతను ఎదుర్కొంటున్న రైతులకు అది తక్షణ ఉపశమనం ఇవ్వదు. అందుకే ఈ అంశంలో ప్రభుత్వానికి మరింత పారదర్శకత అవసరమని, ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అనేక వర్గాలు కోరుతున్నాయి. తెలంగాణలో నీటి సమస్య కొత్తది కాదు. దశాబ్దాలుగా సాగునీటి కొరత, వర్షాలపై ఆధారపడే వ్యవసాయం, ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు ప్రజలను వేధిస్తూనే ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ సమస్యలకు ఒక పెద్ద పరిష్కారంగా భావించబడింది. అందుకే ఈ ప్రాజెక్టు పనితీరు, నిర్వహణ, వినియోగం అన్నీ ప్రజల జీవితాలతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఒకవేళ పంపులు సమర్థంగా నడిస్తే రైతులకు ఊరట లభిస్తుంది. ఒకవేళ సాంకేతిక లోపాలు లేదా నిర్వహణ లోపాలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఈ రెండు పరిస్థితుల మధ్య రాజకీయ ఆరోపణలు పెరిగితే అసలు సమస్య మరుగున పడే ప్రమాదం ఉంది.

కాళేశ్వరం పంపులపై కొనసాగుతున్న రాజకీయ వాదనలు తాత్కాలికంగా వార్తల్లో హాట్ టాపిక్‌గా కనిపించవచ్చు. కానీ దీని వెనుక ఉన్న అసలు సమస్య చాలా లోతైనది. అది తెలంగాణ భవిష్యత్తు, రైతుల జీవనం, గ్రామీణ నీటి భద్రత, రాష్ట్ర ఆర్థిక సమతుల్యతతో ముడిపడి ఉంది. అందువల్ల ఈ అంశాన్ని రాజకీయ కక్షలతో కాకుండా బాధ్యతాయుతమైన పాలనతో, సాంకేతిక నైపుణ్యంతో, పారదర్శక నిర్ణయాలతో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అంతిమంగా ప్రజలకు కావలసింది ఒకటే సమయానికి నీరు. ఆ నీరు కాళేశ్వరం పంపుల ద్వారా వస్తే, ఆ వ్యవస్థను సమర్థంగా నడపాలి. సాంకేతిక సమస్యలు ఉంటే, వాటిని వేగంగా పరిష్కరించాలి. ఆర్థిక భారం ఉంటే, దానికి సరైన ప్రణాళిక రూపొందించాలి. భద్రతా ఆందోళనలు ఉంటే, వాటిని నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నది కూడా ఇదే. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ఆశగా నిలవాలంటే, అది రాజకీయ చర్చల వేదికగా కాకుండా ప్రజల అవసరాలను తీర్చే జీవనరేఖగా కొనసాగాలి.


## Advertisment Tariff

కలర్ ఫుల్ పేజీ (బ్యాక్) : రూ.50,000/-

కలర్ ఆఫ్ పేజీ (బ్యాక్) : రూ.30,000/-

కలర్ క్వాటర్ పేజీ (బ్యాక్) : రూ. 20,000/-

## బ్లాక్ & వైట్

ఫుల్ పేజీ : రూ.30,000/-
ఆఫ్ పేజీ : రూ. 20,000/-
క్వాటర్ పేజీ (బ్యాక్) : రూ. 10,000/-

**Cell : 9381205266**
**8977022449**

## విలేకరులు కావలెను

తెలంగాణ వ్యాప్తంగా మీ ముందుకు వస్తున్న

**జన సమయం**

పక్షపత్రికకు

తెలంగాణలోని అన్ని నియోజక వర్గాల నుండి

**విలేకరులు కావలెను**

ఆసక్తి కలిగినవారు సంప్రదించండి

**సెల్ : 9381205266**
**8977022449**

# ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగాలు



తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగాలకు వేళ అయ్యింది. 1500 కండక్టర్ ఉద్యోగాలకు సంబంధించి త్వరలోనే ఆర్టీసీ నుంచి నోటిఫికేషన్ విడుదల కానుంది. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకొని ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న యువతీయువకులు.. ఎలాంటి రాత పరీక్ష లేకుండా కండక్టర్ జాబ్‌ను పొందే ఛాన్స్ ఉంది. టెన్త్‌లో మెరుగైన మార్కులు వస్తే.. కండక్టర్ పోస్టుకు ఎంపికై టికెట్ టికెట్.. రైట్ రైట్ అంటూ మీరు కూడా డ్యూటీ చేయొచ్చు.

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు గుడ్ న్యూస్. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా ఆర్టీసీలో కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆర్టీసీలో 1500 కండక్టర్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం త్వరలోనే ఈ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే పదో తరగతిలో సాధించి మెరిట్ మార్కుల ఆధారంగా ఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. కండక్టర్ ఉద్యోగానికి అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్, దరఖాస్తుకు చివరి తేదీ తదితర వివరాలతో కూడిన నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.

**గ్రేడ్లను మార్కులుగా ఎలా మారుస్తారు..?**

పదో తరగతి పరీక్షల్లో కొంత కాలం మార్కులను ప్రకటించగా.. ఆ తర్వాత గ్రేడింగ్ విధానాన్ని అవలంభించారు. మళ్లీ మార్కుల విధానానికి మారారు. దీంతో గ్రేడింగ్ విధానంలో టెన్త్ పాసై ఆర్టీసీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి మార్కులు ఎలా కేటాయించాలనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. మార్కుల ప్రకారం రిక్రూట్ చేయడం తేలికే కానీ.. గ్రేడ్లను మార్కులుగా మార్చాల్సి వచ్చినప్పుడు.. కచ్చితమైన మార్కులుగా మార్చడం అనేది కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఆర్టీసీలో ఏటా ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. కానీ కొత్తగా కండక్టర్ల నియామకాలను మాత్రం చేపట్టలేదు. దీంతో ఖాళీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. సిబ్బందిపై పని ఒత్తిడి ఎక్కువగా ఉండే హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర రీజియన్ల పరిధిలోని డిపోల్లో మాత్రం ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. 2025 నవంబర్ నాటికే రాష్ట్రంలో 2059 మంది కండక్టర్ల కొరత ఉండగా.. 2026 మార్చి నాటికి మరో 140 మంది పదవీ విరమణ చేశారు. అదే సమయంలో కొత్త బస్సులు కూడా రోడెక్కాయి. వీటి కోసం వెయ్యి మందికిపైగా కండక్టర్లు అవసరమని ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. తక్షణ అవసరాల కోసం 1500 మంది కండక్టర్ పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాలని 2025 నవంబర్‌లో ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది. దీనికి స్పందనగా ప్రభుత్వం ఏడు నెలల తర్వాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటయిన తొలి నాళ్లలో 2014-15 ఆర్టీసీలో 56 వేల మందికిపైగా సిబ్బంది ఉండగా.. 2025 చివరి నాటికి ఈ సంఖ్య 39 వేల లోపే ఉంది. 11 ఏళ్లలో 18 వేల మందికిపైగా ఉద్యోగులు తగ్గారు. దీంతో ఇతర ఉద్యోగాల భర్తీకి సైతం త్వరలోనే కసరత్తు జరిగే అవకాశం ఉంది.

# మూసీ ప్రాజెక్టుకు రూ 7 వేల కోట్ల నిధులు, 21 కిమీ రివర్ ఫ్రంట్ ఉత్తర్వులు.



తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మెగా ప్రాజెక్టు పనుల కోసం ఏకంగా రూ.7,345 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులను ప్రభుత్వం రెండు విధాలుగా సమర్చుకోనుంది. మొత్తం రూ.7,345.12 కోట్లలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల భారీ రుణాన్ని తీసుకోనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరు జ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సీఎం రేవంత్ మూసీ రివర్ ప్రాజెక్టును ప్రతిష్మాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఏ మార్గాలను డెవలప్ చేయాలనే అంశం పైన నిర్ణయానికి వచ్చారు. అందులో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి.

సీఎం రేవంత్ నిర్ణయంతో ప్రభుత్వ తాజా నిర్ణయం మేకు భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. కాగా, మిగతా రూ.2,845.12 కోట్లు  లేదా జ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇక.. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ విధానంలో నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి సర్కార్ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్‌కు ప్రభుత్వం స్పష్టమైన మార్గనిర్దేశం చేసింది. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మూసీ రివర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఇక ముందుకే వెళ్లాలని డిసైడ్ అవ్వటంతో పాటుగా యాక్షన్ ప్లాన్ అమలుకు సిద్ధం అవుతోంది.

# రూ.1.10 లక్షలు.. మొత్తం పది రూపాయల నాణేలే.. బస్తాల్లో తీసుకెళ్లి మరీ బైక్ కొనుగోలు చేసిన వ్యక్తి




మార్కెట్లో 10 రూపాయల నాణేల చెల్లుబాటుపై అవగాహన కల్పించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా వెలిమినేడుకు చెందిన కొండె రఘుపతి ఒక వినూత్న ప్రయత్నం చేశాడు. చిట్యాలలోని శ్రీ వినాయక మోటార్స్ నుంచి స్ప్లెండర్ ప్లస్ ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసిన రఘుపతి.. అందుకోసం ఏకంగా రూ. 1.10 లక్షల మొత్తాన్ని కేవలం రూ. 10 కాయిన్స్ రూపంలోనే చెల్లించాడు. షోరూమ్ సిబ్బంది ఈ మొత్తాన్ని ఓపికగా లెక్కించి అతడికి సరికొత్త బైక్‌ను అప్పగించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఎవరైనా కొత్త బైక్ లేదా కారు కొనుగోలు చేయాలనుకుంటే ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు చేస్తారు.. లేదా కరెన్సీ నోట్లను కట్టల రూపంలో షోరూమ్ నిర్వాహకులకు అందజేస్తారు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ వ్యక్తి మాత్రం ఇందుకు భిన్నంగా సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చాడు. మార్కెట్లో పది రూపాయల నాణేల చెల్లుబాటుపై ఉన్న అపోహలను తొలగించడమే ధ్యేయంగా.. ఏకంగా రూ. 1.10 లక్షల విలువైన మోటార్ సైకిల్‌ను కేవలం రూ. 10 నాణేలను మాత్రమే చెల్లించి కొనుగోలు చేశాడు. ముఖ్యంగా బస్తాల్లో నాణేలను వేసుకుని వచ్చి మరీ కుప్పగా పోశాడు. ఆపై వాటిని లెక్కించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా ఆశ్చర్యపోతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

**చిట్యాల షోరూమ్‌లో కాయిన్స్ జాతర!**

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండె రఘుపతి అనే యువకుడు ఒక మోటార్ సైకిల్ కొనాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా చిట్యాల కేంద్రంలోని 'శ్రీ వినాయక మోటార్స్' షోరూమ్‌కు వెళ్లాడు. అక్కడ తనకు నచ్చిన సరికొత్త 'స్ప్లెండర్ ప్లస్' బైక్‌ను సెలెక్ట్ చేసుకున్నాడు. అయితే బిల్లు చెల్లించే సమయం వచ్చేసరికి రఘుపతి తన వెంట తెచ్చుకున్న సంచులను షోరూమ్ సిబ్బంది ముందు ఉంచాడు. వాటిని తెరిచి చూసిన సిబ్బంది ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఆ సంచుల నిండా పది రూపాయల నాణేలే దర్శనమిచ్చాయి.

**శ్రమ అనుకోకుండా లెక్కించిన సిబ్బంది..**

బైక్ ఆన్‌రోడ్ ధర, ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం రూ. 1.10 లక్షల బిల్లు కాగా. రఘుపతి ఆ మొత్తాన్ని పూర్తిగా 10 రూపాయల నాణేల రూపంలోనే కౌంటర్ మీద పెట్టాడు. మార్కెట్లో చాలా చోట్ల పది రూపాయల నాణేలను తీసుకోవడానికి చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణదారులు నిరాకరిస్తున్న నేపథ్యంలో.ఆ నాణేలు చట్టబద్ధమైనవే అని నిరూపించడానికి తను ఈ ప్రయత్నం చేసినట్లు రఘుపతి తెలిపాడు. కస్టమర్ ఉద్దేశాన్ని, అతడి వినూత్న ప్రయత్నాన్ని అర్థం చేసుకున్న వినాయక మోటార్స్ యాజమాన్యం ఏమాత్రం అసహనం ప్రదర్శించకుండా ఆ నాణేలను స్వీకరించేందుకు అంగీకరించింది. ఆ తర్వాత షోరూమ్ సిబ్బంది అంతా కలిసి శ్రమ అనుకోకుండా కొన్ని గంటల పాటు కూర్చుని.. ఆ పది రూపాయల నాణేలన్నింటినీ కచ్చితంగా లెక్కించారు. మొత్తం రూ. 1.10 లక్షల కాయిన్స్ సరిగ్గా సరిపోవడంతో.. రఘుపతికి బైక్ తాళాలను అందజేసి అభినందించారు.

# దళపతి విజయ్ బాటలో ధనుష్ కొత్త పార్టీ స్టాలిన్‌తో భేటీ



తమిళనాడు రాజకీయాలకు, వెండితెరకు దశాబ్దాలుగా విడదీయరాని అనుబంధం ఉంది. నిన్న మొన్నటివరకు సినిమా స్క్రీన్‌పై రికార్డులు తిరగరాసిన స్టార్ హీరో దళపతి విజయ్.. తమిళగ వెట్రి కళగం పార్టీతో అసెంబ్లీ బరిలోకి దిగి ఏకంగా ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి ప్రభంజనం సృష్టించారు. ఇప్పుడు సరిగ్గా అదే బాటలో కోలీవుడ్ విలక్షణ నటుడు, జాతీయ ఉత్తమ నటుడు ధనుష్ కూడా ఖద్దరు చొక్కా తొడగడానికి గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ తాజా పరిణామాలు. ఇటీవల సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఒకే ఒక్క అంశం ఏమిటంటే.. ధనుష్ పొలిటికల్ ఎంట్రీ! దీనికి కారణం ఆయన అభిమాన సంఘం ఒక్కసారిగా తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.

తెరపైకి 'అధికారిక జెండా'.. ఫ్యాన్స్ హడావిడి! 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్' తాజాగా సోషల్ మీడియాలో ఒక అధికారిక జెండాను ఆవిష్కరించింది. ఎరుపు, తెలుపు రంగుల కలయికతో.. ధనుష్ ఇరుచేతులు జోడించి నమస్కరిస్తున్న భంగిమలో ఉన్న ఈ జెండా లుక్ చూస్తే సాదాసీదా సేవా సంస్థ మార్కులా కాకుండా, పక్కా ఒక పొలిటికల్ పార్టీ జెండాలాగే డిజైన్ చేయడం విశేషం. దళపతి విజయ్ కూడా మొదట్లో తన 'విజయ్ మక్కల్ ఇయక్కం' ఫ్యాన్స్ క్లబ్‌ను ఇలాగే సేవా కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, ఆ తర్వాతే పార్టీగా మార్చారు. ఇప్పుడు ధనుష్ ఫ్యాన్స్ కూడా అదే పంథాలో నడుస్తుండటంతో.. ఇది 2031 అసెంబ్లీ ఎన్నికల టార్గెట్‌గా వేసిన లాంగ్ టర్మ్ స్కెచ్ అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సీఎం స్టాలిన్‌తో భేటీ.. ఆంతర్యం ఏంటి? ఈ పొలిటికల్ హీట్‌కు మరింత ఘాటు పెంచుతూ.. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్‌ను ధనుష్ మర్యాదపూర్వకంగా కలవడం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ భేటీ కేవలం వ్యక్తిగత అవసరాల కోసమా? లేక భవిష్యత్తు పొలిటికల్ స్క్రిప్ట్‌కు ఏమైనా ఇక్కడే పునాది పడిందా? అనే చర్చలు జోరందుకున్నాయి. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా రక్తదానం, ఉచిత విద్య సహాయం లాంటి సామాజిక సేవల పేరిట క్యాడర్‌ను లైన్ లో పెట్టాలని ధనుష్ తన అంతర్గత వర్గాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు గట్టిగా వినిపిస్తోంది. సైలెంట్ గా ఉన్న ధనుష్.. సస్పెన్స్ లో కోలీవుడ్! ప్రస్తుతం చేతినిండా పాన్-ఇండియా ప్రాజెక్టులు, డైరెక్షన్ పనులతో బిజీగా ఉన్న ధనుష్ గానీ, ఆయన పీఆర్ టీమ్ గానీ ఈ ప్రచారంపై ఇప్పటివరకు నోరు మెదపలేదు. ఇది కేవలం అభిమానుల ఉత్సాహమా? లేక 'కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం - ధనుష్' అన్నట్టుగా బ్యాక్‌గ్రౌండ్‌లో పెద్ద ప్లానే నడుస్తోందా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఒకవేళ ధనుష్ నిజంగానే పొలిటికల్ ఎంట్రీ ఇస్తే మాత్రం.. తమిళనాట సరికొత్త రాజకీయ సమీకరణాలు మారడం ఖాయం!

# దేశంలోని అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి 200 ఏళ్ల రికార్డు బద్దలు



దేశంలోని అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం కేరళ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, దిల్లీ, ముంబై, గుజరాత్ లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. కేరళలోని వయనాడ్ లో కొండ చరియలు విరిగిపడి ముగ్గురు మృతి చెందారు. మరికొంతమందికి గాయాలయ్యాయి. అలాగే గుజరాత్ లోని సూరత్ వర్షం ఉగ్రరూపం దాల్చింది. గత రెండు రోజులుగా అక్కడ కురుస్తున్న అతి భారీ వర్షాలకు ఐదుగురు మృతి చెందారు. అలాగే మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వర్షాల కారణంగా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కన్నడ లోని పలు జిల్లాల్లో ఇప్పటికే రెడ్ అలర్ట్ ప్రకటించారు. అక్కడి పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలకు సెలవులు ప్రకటించారు. ప్రజల్ని లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలు స్థానిక బీచ్ లు, కొండ ప్రాంతాలకు వెళ్లకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మత్స్యకారులు చేపల వేటకోసం సముద్రంలోకి వెళ్లొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇక భారీ వర్షాలు, వరదల కారణంగా గుజరాత్ అస్తవ్యస్తం అవుతోంది. గుజరాత్ లోని సూరత్ ను భారీ వర్షాలు ముంచెత్తాయి. కామ్రేజ్ లో 403ఎంఎం, పల్సానాలో 357 ఎంఎం వర్షపాతం నమోదైంది. దీంతో 200 ఏళ్ల రికార్డు బద్దలు కావచ్చని తెలుస్తోంది. ఇప్పటికే చాలా ఏరియాలు జల దిగ్బంధమయ్యాయి. రూరల్ ఏరియాల నుంచి వరద పోటెత్తడంతో జనజీవనం స్తంభించింది. ఈ ప్రమాదాల్లో ఆరుగురు చనిపోగా, అధికారులు 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో 72 గంటలు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీవ్రంగా హెచ్చరించింది. ఈ మేరకు ప్రజలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. సూరత్ లోని అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతులో నీళ్లు నిలిచిపోయాయి. దాంతో ప్రజలు ఇళ్లు, అపార్ట్ మెంట్స్ నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. వర్షం నీటి కారణంగా కరెంట్ షాక్ తగిలి ఇద్దరు మృతి చెందారు. సూరత్ లోని రాందర్ ప్రాంతంలోనూ విద్యుత్ షాక్ కారణంగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఇప్పటికే భారత వాతావరణ శాఖ ఆదేశాల మేరకు అక్కడి పాఠశాలలు మూసివేశారు. రెడ్ అలర్ట్ ప్రకటించారు.

# జమిలి, డీలిమిటేషన్ పై కేంద్రం బిగ్ ట్విస్ట్

జాతీయ రాజకీయం కీలక మలుపు తీసుకుంది. మోదీ 4.0 దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. అంతు చిక్కని వ్యూహాలతో మోదీ – షా ద్వయం నిర్ణయాలు అమలుకు సిద్దమైంది. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు ఇందుకు వేదిక కానున్నాయి. పెండింగ్ లో ఉన్న కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు కేంద్రం సమాయత్తం అవుతోంది. జమిలి.. డీలిమిటేషన్ అమలు దిశగా కార్యాచరణ వేగవంతం అయింది. అమలు ముహూర్తం ఫిక్స్ చేసారు.

కేంద్రంలోని బీజేపీ నాయకత్వం కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. గత సెషన్ లో వీగిపోయిన మహిళా రిజర్వేషన్లు – డీలిమిటేషన్ బిల్లును పూర్తి స్థాయిలో అమోదం పొందే విధంగా వ్యూహాల ను సిద్దం చేసింది. జమిలి బిల్లును సైతం ప్రవేశ పెట్టాలని ఆలోచన చేస్తోంది. రెండు దశల్లో జమిలి అమలుకు వీలుగా బిల్లు సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ముందుగా కేంద్రం తాజా ఆదేశాలు ఆసక్తి కరంగా మారాయి. జమిలి ఎన్నికలతో సహా పార్లమెంట్ సంయుక్త కమిటీల(జేపీసీ) పరిశీలనలో ఉన్న అన్ని బిల్లులపై నివేదికలను జూలై 20 నుంచి ప్రారంభమయ్యే వర్షాకాల సమావేశాల్లోనే సమర్పించాలని కేంద్రం సూచన చేయటం కీలకంగా మారుతోంది. జమిలి ఎన్నిక ల పైన బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వంలోని 39 మంది సభ్యుల కమిటీ తన నివేదికకు తుది మెరుగులు దిద్దుతోంది. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్‌కు సంబంధించిన బిల్లుపై ఏర్పర్చిన జేపీసీ నివేదికను చైర్మన్ పురంధేశ్వరి ఈ సమావేశాల్లోనే సమర్పించనున్నారు.

పార్లమెంట్ సమావేశాల వేదికగా నిర్ణయాలు వీటితో పాటుగా కేంద్రం మరో సంచలన బిల్లు పైన ఏర్పాటైన జేపీసీ సైతం తమ నివేదికను పార్ల మెంట్ కు సమర్పించేందుకు సిద్దం అవుతోంది. తీవ్రమైన ఆరోపణలపై 30 రోజులకు పైగా జైలు శిక్షను అనుభవించిన ప్రధాని, కేంద్రమంత్రులు, సీఎంలు, రాష్ట్ర మంత్రులను తొలగించేందుకు రూపొందించిన మూడు



బిల్లులను పరిశీలించేందుకు ఏర్పర్చిన జేపీసీ నివేదిక ఈ సమావేశాల్లో నే పార్లమెంట్ కు సమర్పించనున్నారు. సంఖ్యా పరంగానూ బీజేపీ జాగ్రత్తలు తీసుకుంటోంది. కాగా, శివసేన థాకరే వర్గం, టీఎంసీ నుంచి పెద్ద సంఖ్యలో ఎంపీలు ఎన్డీఏకు మద్దతుగా ముందుకు వచ్చారు. దీంతో.. ఉభయ సభల్లోనూ కావాల్సిన బలం సమీకరణలో బీజేపీ చివరి ప్రయత్నాలు చేస్తోంది. అటు విపక్షాలు మాత్రం డీలిమిటేషన్ బిల్లును ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించనీయ బోమని శపథం చేస్తున్నాయి. నెల రోజులు జైలులో ఉంటే పదవి నుంచి తెలిగించే బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. దీంతో.. ఈ సారి పార్లమెంట్ సమావేశాల్లో జరిగే నిర్ణయాల పైన రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

# హిందూ మహా సముద్రంలోకి భారత్ నయా అస్త్రం.. శత్రు దేశాలకు ముచ్చెమటలు



భారత నౌకాదళ బలం మరింతగా పెరిగింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో దేశ భద్రతను శోధించే అత్యాధునిక సర్వే నౌక ఐఎన్ఎస్ సంశోధక్ తన సొంత కేంద్రమైన కొచ్చి నౌకాశ్రయానికి చేరుకుంది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ అధునాతన సర్వే వెస్సెల్ లార్జ్ విభాగపు నాలుగో నౌక, భారత నౌకాదళానికి చెందిన ప్రతిష్టాత్మక దక్షిణ నావికాదళం ఆధీనంలోకి ప్రవేశించింది. దీని రాకతో రాబోయే రోజుల్లో సముద్ర అంతర్భాగ పరిశోధనలలో భారత్ సాధించబోయే పురోగతి సరికొత్త మైలురాయిగా నిలవనుంది.

గత నెల జూన్ 21వ తేదీన కోల్ కతాలో జరిగిన చారిత్రాత్మక రక్షణ రంగ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నౌక అధికారికంగా భారత నావికాదళంలో చేరింది. కమిషనింగ్ కార్యక్రమం ముగిసిన అనంతరం, ఐఎన్ఎస్ సంశోధక్ కోల్ కతా నుంచి కొచ్చి వ్యూహాత్మక తీరానికి తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా ప్రారంభించింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో భాగంగా ఇది తూర్పు తీరంలోని విశాఖపట్నం, చెన్నై రేవులను సందర్శిస్తూ, చివరకు జూలై 5వ తేదీన తన గమ్యస్థానమైన కొచ్చికి చేరుకుంది. తమ హోమ్ పోర్టుకు చేరుకున్న ఐఎన్ఎస్ సంశోధక్ యుద్ధ నౌకకు అధికారులు, నావిక దళ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. సముద్ర రక్షణ సంప్రదాయాల ప్రకారం ఈ నౌకకు వాటర్ కెనాన్ సెల్యూట్ ఇవ్వడం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే నేవీ బ్యాండ్ తమ దేశభక్తి గీతాల ప్రదర్శనతో ఈ వేడుకలో ప్రత్యేక జోష్ నింపింది. ఈ గర్వకారణమైన క్షణాలను కళ్లారా చూసేందుకు నౌకలోని సైనికుల కుటుంబ సభ్యులందరూ పెద్ద ఎత్తున హాజరయ్యారు. బహుముఖ వ్యూహాత్మక సామర్థ్యం ఈ అధునాతన నౌక కేవలం పర్యవేక్షణకు మాత్రమే పరిమితం కాకుండా, అనేక రకాల సేవలను అందించే సామర్థ్యం కలిగి ఉంది. ఇందులో అమర్చిన అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్, ఓషియానోగ్రాఫిక్ సర్వే పరికరాలు సముద్ర గర్భంలోని లోతులు, మార్పులను ఖచ్చితంగా అంచనా వేస్తాయి. అంతేకాకుండా ఇక్కడ ఒకే వేదికపై హెలికాప్టర్ కార్యకలాపాలను నిర్వహించే డెక్ సౌకర్యం కూడా ఉంది. విపత్తుల సంభవించిన సమయాల్లో తక్షణమే స్పందించి సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు వీలుగా దీనిని రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఐఎన్ఎస్ సంశోధక్ ను పూర్తి స్థాయి మొబైల్ ఆసుపత్రి నౌకగా మార్చే సదుపాయం కూడా ఇందులో ఉండడం విశేషం. ఆత్మనిర్భర్ భారత్ నినాదంలో భాగంగా పూర్తి దేశీయ పరిజ్ఞానంతో నౌకా నిర్మాణాన్ని చేపట్టడం రక్షణ రంగానికి ఎనలేని బలాన్ని ఇచ్చింది. ఐఎన్ఎస్ ఇక్షక్ తర్వాత దక్షిణ నావికాదళ పరిధిలోకి వచ్చిన రెండో భారీ సర్వే నౌకగా ఇది గుర్తింపు పొందింది. ఈ నౌక సముద్ర మార్గాల భద్రతను పెంచడంలో కీలకపాత్ర పోషించనుంది.

6వ భాగము

# రాష్ట్రములు

## 1వ అధ్యాయము

## సాధారణ విషయాలు

Note: (The words IN PART A OF THE FIRST SCHEDULEμμ is omitted by the Dear Santh Amendment) Act, 1956. Sec. 29 and Sch.)

అరికల్ 152: నిర్వచనం :- ఈ భాగంలో సందర్భం వేరు విధంగా కోరిననే తప్ప, అనే వదంలో శిజమ్మూ మరియు కాశ్మీరు రాష్ట్రం చేరదు.

[Subs. by the Const. (7th Amdt.) Act, 1956]

## 2వ అధ్యాయము

## కార్యనిర్వాహక వర్గం
## (The Executive)


# గవర్నర్

ఆర్టికల్ 153 : రాష్ట్రగవర్నరు :-ప్రతి రాష్ట్రమునకు గవర్నరు ఒకరు ఉండవలెను.

అయితే, ఈ ఆర్టికలులో వున్న దేదియూ, ఒక వ్యక్తిని రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రములకు గవర్నరుగా నియమించుట నుండి నివారించదు.
[Added by the Const. (7th Amdt.) Act, 1956]

ఆర్టికల్ 154 : రాష్ట్ర కార్యనిర్వహణాధికారం :-(1)రాష్ట్ర కార్యవిధాన నిర్వహణాధికారం

# భారత రాజ్యాంగం




గవర్నరు యందుండును. ఆయన ఈ అధికారమును రాజ్యాంగమునకు అనుగుణంగా స్వయంగా కాని లేదా తన సబార్డినేటు అధికారులు ద్వారా గాని వినియోగించవలెను.

(2) అయితే, ఈ ఆర్టికలులో ఉన్న దేదియూ

(ఎ) ప్రస్తుతమున్న ఏదేని శాసనం ద్వారా ఎవరేని ఇతర ప్రాధికారికి ఇవ్వబడిన వేదేని కర్తవ్యములను గవర్నరుకు బదిలీ చేయునదిగా భావించరాదు; లేక

(బి) గవర్నరుకు సబార్డినేటుగా ఉన్న ఎవరేని ప్రాధికారికి ఏదేని కర్తవ్యములను శానము ద్వారా పార్లమెంటు లేదా రాష్ట్ర శానన నభ సంక్రమింప చేయవచ్చును.

చేసి మరియు ముద్రవేసి ఇచ్చిన వారెంటు ద్వారా నియమించవలెను. ఆర్టికల్ 155 : గవర్నరు నియామకము ఒక రాష్ట్రపు గవర్నరును రాష్ట్రపతి సంతకము

ఆర్టికల్ 156 :Presure of the President) ఉన్నంత

కాలం, పదవి యందుండును. గవర్నరు పదవీ కాలావధి :(1) గవర్నరు, రాష్ట్రపతి అభీష్టము

(2) గవర్నరు. తన సంతకముతో గూడిన లిఖిత పత్రమును రాష్ట్రపతికి వుల తన పదవికి రాజీనామా చేయవచ్చును.

(3) ఆధికలులోని పైన పేర్కొనిన నిబంధనలకు లోబడి, గవర్నరు, ఆ పడవిలో ప్రవేశించిన తేదీ నుండి అయిదు సంవత్సరముల కాలావధి వరకు వదవి యందుండును

అయితే, గవర్నరు తన పదవి కాలావధి ముగిసినప్పటికినీ, తన వారసుడు ఆ పడవిలో ప్రవేశించునంతవరకు వదవి యందు కొనసాగవలెను.

ఆర్టికల్ 157 : గవర్నరు నియామకమునకు అర్హతలు – ఒక వ్యక్తి, భారత పాముక వుండి, 33 సంవత్సరాల వయస్సు దాటినవాడై ఉంటే తప్ప, గవర్నరుగా నియమించబడులకు అర్హుడు కాదు.

ఆర్టికల్ 158 : గవర్నరు పదవి నిబంధనలు :- (1) గవర్నరు పార్లమెంటులోని ఏలేని

నభలోగానీ, మొదటి షెడ్యూలులో నిర్దిష్టపరచిన రాష్ట్రవు కానన సభ లేదా శానననరివత్తులోగాని సభ్యుడిగా ఉండరాదు. పార్లమెంటులోని ఏదేని నభలోని నభ్యుడు లేదా ఏదేని రాష్ట్ర శాసన అతని మండలి యొక్క సభలోని సభ్యుడు. గవర్నరుగా నియమించబడినచో, ఆయన గవర్నరు వదవిలోనికి ప్రవేశించిన తేదీన, నదరు సభలోని సీటు ఖాళీ చేసినట్లు భావించబడవలెను.

(2) గవర్నరు, ఏదేని ఇతర లాభసాటి వదవిని కలిగి ఉండరాదు.

(3) గవర్నరు. అతని అధికార నివాసమును అద్దె చెల్లించకుండా వినియోగించు కోవడానికి హక్కు కలిగియుండును. ఆయన పార్లమెంటు శాసనము ద్వారా నిర్ణయించినట్టి జీతభత్యములు, విశేష హక్కులు పొందు హక్కును కూడ కలిగియుండును. ఈ విషయంలో అట్టి నిబంధన చేయునంతవరకు, రెండో షెడ్యూలులో నిర్దిష్టపరిచ్నిసిట్టి జీతభత్యములు, విశేష హక్కులను పొందుటకు హక్కు కలిగియుండును.

(3ఏ) ఒకే వ్యక్తి రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నరుగా నియమించ బడినపుడు, గవర్నరుకు చెల్లించదగు వేతన భత్యాదులను రాష్ట్రపతి నిర్ణయించునట్టి దామాషాలో

[Inst. by the Const. (7th Amdt.) Act, 1956]

(4) గవర్నరు జీతభత్యములు, అతను పదవిలో ఉండు కాలావధిలో తగ్గించరాదు.

ఆర్టికల్ 159 : గవర్నరు ప్రమాణ స్వీకారం, లేదా ప్రతిజ్ఞ చేయుట :–ప్రతి గవర్నరు మరియు గవర్నరు విధులను నిర్వహిస్తున్న ప్రతి వ్యక్తి, పదవీ స్వీకారము చేయుటకు ముందు, ఆ రాష్ట్రము విషయంలో అధికారితను వినియోగిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన లేనపుడు ఆ కోర్టులో లభ్యమగు అత్యంత సీనియరు జడ్డి సమక్షంలో, ఈ క్రింది నమూనాలోని ప్రతిజ్ఞ లేదా ప్రమాణ స్వీకారం చేసి, నంతకము చేయవలెను. అదేదనగా

“ఎ.బి. అను నేను, నిర్వహింతుననియు లేక గవర్నరు కృత్యములను శ్రద్ధాపూర్వకముగా నిర్వహింతుననియు రాష్ట్ర గవర్నరు పదవిని శ్రద్ధా పూర్వకంగా నా నంపూర్ణ సామర్థ్యం మేరకు రాజ్యాంగమును మరియు శాననమును పరిరక్షించి, సంరక్షించి రక్షించుదుననియు రాష్ట్రము యొక్క ప్రజల సేవయందును వారి క్షేమము నందును నిమగ్నుడనయ్యె

దననియు, దైవసాక్షిగా ప్రమాణము చేయుచున్నాను / సత్యనిష్టతో ప్రతిజ్ఞ చేయుచున్నాను.”

ఆరికల్ 160: కొన్ని అనుకోని పరిస్థితులలో గవర్నరు కర్తవ్యములను వేరొకరు నిర్వహించుట :- ఈ అధ్యాయంలో నిబంధించిన కారణముల వలనగాక, ఏదేని అనుకోని పరిస్థితి ఏర్పడినపుడు గవర్నరు కర్తవ్యములను నిర్వర్తించుటకై, రాష్ట్రపతి తాను నబబని తలచునట్టి ఏర్పాటు చేయవలెను.

ఆరికల్ 161 : గవర్నరుకు క్షమాదానము మొదలైనవి చేయు అధికారములు : కొన్ని

కేసులలో దండనోతరువులను సస్పెండు చేయుటకు. మాపీ చేయుటకు, తగ్గించుటకు అధికారములు రాష గవర్నరు కలిగి ఉండును. రాష్ట్ర ఏదేని విషయమునకు చెందిన ఏదేని శాననమునకు వ్యతిరేకంగా చేసిన ఏదేని అవరాధమునకు . రాష్ట్ర కార్యనిర్వహణ అధికారం విస్తరించివున్న గాను దోషసావన చేయబడిన ఎవరేని వ్యక్తికి, క్షమాదానము చేయడానికి, తాత్కాలికంగా నిలుపుదల చేయడానికి, వాయిదాలను లేదా వరిహారములను మంజూరు చేయడానికి, ఇచ్చిన దండనోత్తరువును వాయిదా వేయడానికి, మాపీ చేయడానికి లేదా తగ్గించడానికి అధికారం కలిగియుండును.

ఆరికల్ 162: రాష కార్యనిర్వహణాధికారపు విస్తరణ:- ఈ రాజ్యాంగ నిబంధనలకులోబడి, రాష్ట్ర ప్రభుత్వపు కార్యనిర్వహణాధికారం రాష్ట్ర శాసన మండలి కాననములు చేయు అధికారంలో చేరివున్న విషయములన్నింటికి విస్తరించును :అయితే, కొన్ని అంశములకు సంబంధించి రాష్ట్ర శాసన మండలికి మరియు పార్లమెంటుకు శాసన నిర్మాణాధికారము ఉండవచ్చును. ఇట్టి విషయములలో రాష్ట్ర కార్య నిర్వహణాధికారం, ఈ రాజ్యాంగం ద్వారా లేదా పార్లమెంటు చేసిన చట్టం ద్వారా యూనియనుకు లేదా దాని ప్రాధికారులకు స్పష్టంగా ఇవ్వబడిన కార్యనిర్వణాధికారానికి కార్యనిర్వణాధికారానికి లోబడి మరియు దానిచే వరిమితమై ఉండవలెను.

## మంత్రి మండలి

ఆర్టికల్ 163 : మంత్రి మండలి గవర్నరుకు సహాయపడుట మరియు సలహా లిచ్చుట: (1) ఈ రాజ్యాంగము ద్వారా, లేదా రాజ్యాంగము క్రింద గవర్నరు తన కర్తవ్యములను లేక వాటిలో వేటినైనను తన వివేచనానుసారం స్వతంత్రముగా నిర్వహించవలెనని కోరబడిన వనులు తప్ప, ఇతర కృత్యములను నిర్వహించుటలో ఆయనకు సహాయపడుటకును మరియు నలహాలిచ్చుటకును ముఖ్యమంత్రి ఆధిపత్యమున్న మంత్రి మండలి ఒకటుండవలెను.

(2) ఈ రాజ్యాంగము ద్వారా, లేదా రాజ్యాంగము క్రింద ఏదేని విషయమున గవర్నరు తన వివేచన మేరకు వ్యవహరించుట అపేక్షితమా, కాదా యను ప్రశ్న ఉత్పన్నమైనచో, దానిపై ఆయన తన వివేచనానుసారము చేసిన నిర్ణయము అంతిమమై యుండును. గవర్నరు తన వివేచనానుసారం వ్యవహరించి యుండవలెననెడి, లేక వ్యవహరించి యుండ కూడదనెడి. కారణమును బట్టి ఆయన చేసిన ఏ పని యొక్క మాన్యతను ఏ న్యాయస్థాన ములోనూ ప్రశ్నించరాదు.

(3) గవర్నరుకు మంత్రులచే ఏదేని సలహా ఇవ్వబడిందా లేదా, అట్లైనచో, అది ఏ అను ప్రశ్నను ఏ కోర్టులోనూ వరిశీలించబడరాదు.

నియమించుట ఆయన వలపై ఇతర మంత్రులను నియమిందును మంత్రులు గవర్నరు అభిద్ధము వున్నంతకాలము పదవి యందు ఉందురు. ఆర్టికల్ 1641 మంత్రులను గురించి. (1)వర్నరుమంత్రిస్

అయితే, జార్కండ్రి బీహారు, మధ్యప్రదేశ్, ఒరిస్సారా ష్ట్రాలలో గిరిజన సంక్షేమ శాఖను జనీరిగా ఉండు మంత్రిఉండవలెను వారు, షెడ్యూలు కులాలు వెనుకబడిన తరగతుల సంక్షేమం లేదా ఏ ఇతర కార్యములకు అదనంగా గిరిజన (ఆదివాసి) (Tribal) సంక్షేమ శాఖకు ఇన్ఛార్జిగా ఉండవచ్చును.

[Subs by the Coral (94th Amdt.) Act, 2006)

(1-ఏ) ఒక రాష్ట్రంలోని మంత్రి మండలిలో ముఖ్యమంత్రితో మంత్రుల మొత్తం సంఖ్య ఆ రాష్ట్ర శాసనసభ మొత్తం సంఖ్యలో పదిహేను శాతమునకు మించరాదు. అయితే, ఒక రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా మంత్రుల సంఖ్య పంన్నెండుకు తక్కువ ఉండరాదు.

అంతేకాకుండా, రాజ్యాంగ (91వ నవరణ) చట్టం, 2003 ప్రారంభంనాటికి ఏదైనా రాష్ట్రంలోని మంత్రి మండలిలో ముఖ్యమంత్రితో సహా మంత్రుల మొత్తం సంఖ్యను, నదరు పదిహేను శాతమునకు మించిఉన్నప్పుడు లేదా నందర్భానుసారం. మొదటి మినహాయింపు నిబంధనలో నిర్దిష్టపరచిన సంఖ్యకు మించి ఉన్నప్పుడు, ఆ రాష్ట్రంలోని మంత్రుల మొత్తం సంఖ్య, పార్లమెంటు సార్వజనిక ప్రకటన ద్వారా నియమించునట్టి తేది నుండి ఆరు నెలల లోపల, ఈ క్లాజు నిబంధనలకు అనుగుణంగా తేవలెను.

(1-4) ఒక రాష్ట్ర శాసనసభ లేదా శానన పరిషత్తు వున్న రాష్ట్రంలోని ఏదైనా సభలో ఏదైనా రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు. పదవ షెడ్యూలు పేరా 2 క్రింద ఆ సభలో సభ్యుడుగా ఉండుట నుండి నిరర్హుడైనపుడు, ఆయన అట్టి ఆ నిరర్హత అతనికి ప్రాప్తించనప్పటి నుండి అటి సభ్యుడుగా పదవీ కాలావధి ముగియునంతరవరకు లేదా అట్టి కాలావధి ముగించుటకుముందే ఆ రాష్ట్ర శాసన సభకు లేదా నందర్భానుసారం శానన పరిషత్తువున్న రాష్ట్రంలో ఏదైనా నభకు జరిగిన ఎన్నికలో పోటీ చేసినట్లయితే, అట్లు ఎన్నికైనట్లు ప్రకటించబడు తేదీ వరకు- ఈ రెండింటిలో ఏదిముందో అంతవరకు గల కాలావధికి కాజు (1) క్రింద మంత్రిగా నియమించబడుటకు నిరర్హుడు కావలెను.)

[Inst. by the Const. (91st Amdt.) Act, 2003 w.e.f. 1-1-2004]

(2) మంత్రి మండలి సమిష్టిగా, రాష్ట్ర శాననసభకు బాధ్యత వహించవలెను.

(3) ఒక మంత్రి అతని పదవిలోకి ప్రవేశించడానికి ముందు గవర్నరు. 3 వ షెడ్యూలులో పొందుపరచిన నమూనా ప్రకారం, పదవి మరియు రహస్యములను కాపాడుదునను ప్రమాణమును అతనిచే చేయించవలెను.

(4) వరునగా ఏదేని ఆరు నెలల కాలావధి పాటు రాష్ట్ర శాసన సభ సభ్యుడుగా లేని మంత్రి, ఆ కాలావధి ముగిసిన మీదట అట్టి మంత్రి పదవి నుండి విరమించవలెను.

(5) మంత్రులకు చెల్లించు వేతనాలు, భత్యాలు రాష్ట్ర శాసన మండలి ఎప్పటికప్పుడు -ర్ణయించినట్లుండవలెను. రాష్ట్ర శాసన మండలి అట్లు నిర్ణయించునంతవరకు రెండో షెడ్యూలులో నిర్ణయించినట్లుండవలెను.

# సాహిత్యం

# చాచిన మట్టి చేతులు



రెండు సంజల మధ్య దూరం నీకు ఒక రాత్రి కావచ్చు
నాకు మాత్రం ఒక పగలు

చుక్కల చీర కప్పుకుంటూ నేను
చీకటి బురఖా విప్పుకుంటూ నువ్వు

వెలుగు నీడల రాకపోకల కోసం
ఒకే స్టేషన్లో ఎదురెదురుగా యిద్దరం

చాచుకుంటూ వస్తున్న మన రెండేసి చేతుల్ని చూసి
గట్టిగా వాటేసుకుంటామనే అనుకుంటారంతా
తీరా దగ్గర కొచ్చేక రెండేసి రైలు పట్టాల్లా
పరస్పరాభిముఖంగా పక్క పక్క నుంచే
అటు నువ్వూ, ఇటు నేనూ

సంజ నుంచి సంజ దాకా ఎటు నుంచి ఎటయినా
ఒక సుదీర్ఘ యాత్ర

బతుకంతా అరుబయిలయిన నాకు
శరీరాన్ని కప్పలేని చింకి పాతల మీది కోపం
గుడ్లప్పగించి చూసే సూర్యుడి మీద కలుగుతుంది.

ఒకప్పటి ఎర్రని నా శరీరఛాయ గురించి ఎవరు చెబుతారు?
మందుటెండలో పాలిచ్చిన అమ్మ తప్ప
నల్లని బొగ్గు ఎర్రతనానికి మండే కొలిమి ఒక్కటే సాక్ష్యం

తీసేకొద్దీ మొలిచే కలుపు
మోసేకొద్దీ పెరిగే బరువు
ఎడతెగని వేడిమీ వెలుతురూ

నడుము వంగినంత సులువుగా
పొద్దు కుంగదు
పగలంతా పురిటి నొప్పుల నిరీక్షణే

రాత్రిసాని వచ్చే వేళక్కాని సుఖ ప్రయాణం మొదలు కాదు.
నాకు సుఖమంటే కాలిన బొగ్గు మీద కాసిన్ని నీళ్ళు చల్లడమే

అంతరంగమంతా అంత:పురమైన నీకు
కాపలా కాస్తున్న గోడల మీది కోపం
నీడ నిచ్చే కప్పుమీద కలుగుతుంది

నాన్న ఛాతీ మీద నర్తించిన నీ చిట్టిపాదాల స్వేఛ

గురించి ఏవరు చెబుతారు ?

కాళ్ళూ, చేతులూ సాగదీసి నలుగు పెట్టిన అమ్మ తప్ప
పక్షి ఎగిరిందని చెప్పడానికి అలసిన రెక్కలే సాక్ష్యం

వయసొచ్చే కొద్దీ ఘోషా అవయవాలు పెరిగే కొద్దీ సిగ్గు
ఎక్కడ తడిమినా చీకటే

ఒళ్ళప్పగించినంత మాత్రాన తెల్లవారదు

రాత్రంతా ఇంటిదొంగల అప్పగింతలే
పగటి ప్రియుడు చుంబిస్తే కాని బండి కదలదు

నీకు కదలికంటే చెక్కిలి మీది
కన్నీటి చుక్క పెదవుల మీద పడటమే

మనం కలిసే చోట విడిపోతున్నామా?
విడిపోయే చోట కలుస్తున్నామా?

ఒక సంజ తొలిపలుకు మరొక సంజ మలిపలుకు
మధ్యలో రెండు విషాదారంభ కావ్యాలు

అంటనంటూనే అలుముకుంటాడు నన్ను
అలుముకుంటూనే అంటనంటాడు నిన్ను

ఒకడు తరుముతాడు ఇంకొకడు తలుపులు మూస్తాడు.

నేను–
గుండెల మీదా, గుడిసె మీదా కప్పులేని దాన్ని
నీ ఒంటి మీదే కాదు, నీ ఇంట్లోనైనా
నీడల చారల్ని చూస్తే ఈర్ష్యపడతాను.

నాలుగ్గోడలక్కర్లేదు కాని ఒక్క నీడ కావాలి
ఒళ్ళు దాచుకోవడానికి అరచేతి నీడ కావాలి.

ద్వారబంధాలు అక్కర్లేదు కాని ఒక్క ద్వారం కావాలి
తల ఎత్తి లోనికెళ్ళినా తగలని ద్వారం కావాలి

తరుముకొచ్చే పగటికాపు
వాకిలి నుంచే తోక ముడవాలి

నువ్వు–
ఒంటి కప్పు మీద వున్న హక్కు ఒంటి మీద లేనిదానివి

అలాగని చీరల్ని తగలెయ్యకు తెల్లని నీ వితంతు వస్త్రం
మీద నల్లని చుక్కలన్నీ నేనే

నీ గోడల్ని కూల్చేసుకో కాని, అరచేతులు జాగ్రత్త
వాటి మీద పండిన నా గోరింటాకు నీడలున్నాయి

తలుపుల్ని తన్నేసెయ్ నీ పాదాలు జాగ్రత్త చీకటి ధూళితో పాటు
నా వెండివెన్నెల గజ్జెలున్నాయి.

ఎన్నాళ్ళీ ఎదురెదురు బెదురు ప్రయాణాలు?

నాజూకైన స్వప్నాల్లో నాలుగు బాహువులు కలవనే కలవ్వు

నా దాకా వస్తే బరి తెగించిన కలనొక దాన్ని బయిట పెడతాను:
ఎర్రని రెండు సంజల మధ్య దూరాన్ని
పండిన రెండు పెదవుల మధ్య దూరానికి కుదించినట్లు.

అప్పుడు అడ్డంగా చిరునవ్వొక వికసించక చస్తుందా?

## నా సముద్రం నవ్వింది

అంత పెద్ద సముద్రానికి నవ్వు ఇంత చిన్నదా–
వెన్నెల్లో చేప పిల్ల తళుక్కుమన్నట్లు

వాడెవడో తెల్లని ఎడారిగాడు  నల్లనివానచుక్కల్ని తాకనన్నాడు
పాలి పోయిన దూది మేఘాలు కాదు–
కుండలు తిరిగిన కారు మబ్బులు మాత్రమే
మెరుపు ఖడ్గాన్ని చేతపట్టగలవు

నేలకిందకు
నా కాలికిందకు
          యుగాల ఆకాశాన్ని
          తరాల అహంకారాన్ని

తెచ్చిపెట్టిన మిత్రమా! సముద్రమా! ఇదుగో
ఈ మూల తేలుతున్న నాలుగు రంగుల నాటుపడవ

పొట్ట చెక్కలయ్యేట్లు ఒకే ఒక నవ్వు నవ్వవా!
నన్ను నల్ల పరిగె పిల్లలా గెంత నివ్వవా!

# గంటల తరబడి కూర్చొని పని చేస్తున్నారా 'సైలెంట్ కిల్లర్'

ఆరోగ్యం



కాలం మారింది. డిజిటల్ యుగం నడుస్తోంది. వర్క్ ఫ్రం హోం.. కంప్యూటర్ల ముందే అంతా పని పూర్తి చేయాల్సి వస్తోంది. షిఫ్టుల పేరుతో గంటల తరబడి కూర్చొని చేసే పని ఎక్కువగా ఉంది. ఆఫీసు పనులైనా, ఆన్‌లైన్ చదువులైనా గంటల తరబడి కంప్యూటర్లు, ల్యాప్ టాప్‌ల ముందు కూర్చోవడం కామన్ గా మారిపోయింది. ఇది 'సైలెంట్ కిల్లర్' గా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగమే అయినా.. కంటిన్యూగా కూర్చోవటం సరి కాదని చెబుతున్నారు. దీని కారణంగా వచ్చే సమస్యల పైన హెచ్చరిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు.

కదలకుండా ఒకే చోట ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల శరీరానికి హాని కలుగుతుంది. కండరాలు బలహీనపడ తాయి, వెన్నెముకపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో నడుము నొప్పి, రక్త ప్రసరణ సరిగా జరగక చేతులు, కాళ్లలో వాపు కూడా రావచ్చు. ఇదే కాకుండా మరి కొన్ని లక్షణాలు కనిపిస్తే మాత్రం వెంటనే అప్రమత్తం కావాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వెన్నెముకపై ఒత్తిడి పెరిగి తీవ్రమైన వెన్ను, నడుము నొప్పికి కారణంగా మారుతోంది. కాళ్లు, చేతుల్లో రక్త ప్రవాహం మందగించి తిమ్మిర్లు లేదా వాపులు కనిపిస్తాయి. కేలరీలు సరిగ్గా బర్న్ అవ్వవు, దీనివల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బుల ముప్పు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎక్కువ సేపు కూర్చోవడం కారణంగా కండరాలు పటుత్వాన్ని కోల్పోతాయి. అదే విధంగా స్క్రీన్ల వైపు నిరంతరం చూడటం వల్ల చూపు మందగించడం, మానసిక ఒత్తిడికి, చిరాకుకు కూడా కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

నిపుణుల సూచనలు అదే విధంగా బరువు పెరగడం, గుండె సమస్యలు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అంతే కాదు.. ఇలా కంటిన్యూగా కూర్చొనే వారిలో జీవక్రియ మందగించడం వల్ల కేలరీలు సరిగ్గా ఖర్చు కావు. ఎప్పుడూ స్క్రీన్‌ను చూస్తూ ఉండడం వల్ల కళ్లపై ఒత్తిడి పెరిగి చూపు సమస్యలు రావచ్చు. ఇది మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపి అలసట, చంచలత్వం, పనిపై దృష్టి తగ్గడం వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అయితే, ఇలా కూర్చొని పని చేసే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందులో ప్రధానంగా వెన్ను నొప్పి, కళ్లు మండటం, అలసట, చేతులు, కాళ్లలో వాపు లేదా నొప్పి, శక్తి లేకపోవడం, నిద్ర సరిగా రాకపోవడం, బరువు పెరగడం, కండరాల బలహీనత వంటి ఉన్నాయి. కూర్చొని పని చేసే వారు కనీసం ప్రతి గంటకు ఒకసారి లేచి విరామం తీసుకోవాలి. కొద్దిసేపు నడక..స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయటం ద్వారా కొంత రిలీఫ్ ఉంటుంది. సమతుల్య ఆహారం తీసుకుని, ఎక్కువగా నీరు తాగాలి. చిన్నపాటి కదలికల ద్వారా సమస్యలు రాకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు.



# రోజుకో చిన్న ముక్క అల్లం తింటే ఎన్నో బెనిఫిట్స్

# కొలెస్ట్రాల్, బీపీకి చెక్..!!

అల్లం. ప్రతీ ఇంటా కనిపిస్తుంది. వంటలోనే కాదు.. ఆరోగ్య పరంగానూ ప్రయోజనాలు అందిస్తుంది. అల్లంలో ఉండే యాంటీ ఇన్ఫ్లమెటరీ గుణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పలు అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. చిన్న సమస్యలతో పాటుగా దీర్ఘకాలిక వ్యాధుల అదుపు లోనూ అల్లం ఉపకరిస్తుంది. అయితే, అల్లం నిత్యం వాడవచ్చా.. ఎంత మోతాదులో వాడాలి వంటి సందేహాలకు నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. అల్లం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అల్లంలో అనేక జీవక్రియశీల సమ్మేళనాలతో పాటుగా జింజెరోల్, షాగావోల్ వంటికి నిక్షిప్తం అయి ఉంటాయి. వీటి లో యాంటీఆక్సిడెంట్, యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి హైబీపీని నియంత్రించడంలో సహాయపడతాయి. అల్లం తినడం వల్ల రక్తనాళాలు సాధారణ స్థితికి వస్తాయి. తద్వారా శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటం సహా హైబీపీ సమస్యను తగ్గిస్తుంది. అదే విధంగా అల్లం వినియోగం ద్వారా జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటివి నియంత్రణలోకి వస్తాయని చెబుతున్నారు. కాగా, ఇక ఆకలిని పెంచడంలో అల్లం పని చేస్తుంది. అల్లంలో వాపు నిరోధక గుణాలు ఉంటాయని చెబుతున్నారు. శరీరంలోని ఏ భాగంలోనైనా వాపును తగ్గించడంలో సహాయకారిగా ఉంటుంది.

రోజు తీసుకోవటం ద్వారా ప్రయోజనాలు కీళ్లు, కండరాలలో నొప్పి ఉంటే.. అల్లం తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అల్లంను క్రమం తప్పకుండా బరువు సైతం అదుపులోనే ఉంటుందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలోనూ అల్లం మేలు చేస్తుంది. అదే విధంగా చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ తో పాటుగా బీపీ నియంత్రణకు సహకరిస్తుంది. డయాబెటిక్ బాధితులకు బ్లడ్ లో షుగర్ నియంత్రణ కు ఉపకరిస్తుంది. దీంతో.. ప్రతీ రోజు ఒక చిన్న అల్లం ముక్క తీసుకోవటం ద్వారా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని స్పష్టం చేస్తున్నారు.

# బుడ్డోడికి అంత సీన్ లేదు.. ఓవర్‌హైప్ చేయకండి: కపిల్ దేవ్

క్రీడలు

భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. వైభవ్ సూర్యవంశీలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ స్థాయి అసాధారణ ప్రతిభ ఉందని ఆయన ప్రశంసించారు. అయితే అదే సమయంలో ఈ యువ ప్లేయర్‌పై సోషల్ మీడియాలో, బయట జరగుతున్న ప్రచారాన్ని తగ్గించాలని కపిల్ దేవ్ సూచించారు. ఇంత చిన్న వయస్సులోనే వైభవ్ సూర్యవంశీపై అవసరానికి మించి అంచనాల భారాన్ని మోపడం సరికాదని.. దీని వల్ల అతను మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

వైభవ్ సూర్యవంశీ ప్రతిభ గురించి కపిల్ దేవ్‌ను ప్రశ్నించగా అతడికి అద్భుతమైన టాలెంట్ ఉందని.. అందులో ఎలాంటి సంగేహం లేదని ఆయన స్పష్టం చేశారు. కానీ ప్రస్తుతం వైభవ్ గురించి అవసరానికి మించి పెద్ద మాటలు మాట్లాడుకుంటున్నామని అభిప్రాయపడ్డారు. వైభవ్ సూర్యవంశీకి కాస్త సమయం ఇవ్వాలని.. ఇప్పుడే అతడిని ఆకాశానికి ఎత్తేసి అనవసరమైన ఒత్తిడిలోకి నెట్టవద్దని సూచించారు. కేవలం టాలెంట్ ఉంటే సరిపోదని.. అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువకాలం స్థిరంగా ఆడినప్పుడే ఏ ఆటగాడైనా గొప్పవాడిగా మారుతాడని కపిల్ దేవ్ గుర్తు చేశారు. వైభవ్ సూర్యవంశీకి అద్భుతమైన సామర్థ్యం ఉందని.. టాలెంట్ పరంగా చూస్తే అతను సచిన్, విరాట్ కోహ్లీలతో సమానమేనని ప్రశంసించారు.

చిన్న వయసులోనే వైభవ్ సూర్యవంశీ టీ20 క్రికెట్లో చూపించిన ఇంపాక్ట్ చాలా అరుదైనదని కపిల్ దేవ్ పేర్కొన్నారు. ఇంత తక్కువ వయసులో ఇలాంటి ఆటతీరును ప్రదర్శించే ఆటగాళ్లు ప్రపంచంలో కేవలం ఒకశాతం మాత్రమే ఉంటారని తెలిపారు. అయితే క్రికెట్లో అసలైన పరీక్ష టెస్ట్ క్రికెట్లోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.





వైభవ్ సూర్యవంశీ టెస్ట్ క్రికెట్ ఆడేటప్పుడు కూడా ఇదే విధమైన స్థిరత్వాన్ని చూపించగలడా అనేది భవిష్యత్తులో తేలాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా సచిన్ టెండూల్కర్ డెబ్యూ చేసిన రోజులను కపిల్ దేవ్ గుర్తుచేసుకున్నారు. 1988-89 కాలంలో సచిన్ టెండూల్కర్ భారత జట్టులోకి వచ్చినప్పుడు ఆయన చుట్టూ ఇంత హడావిడి, శబ్దం లేదని చెప్పారు. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ చుట్టూ ఉన్నంత హైప్ అప్పట్లో సచిన్‌కు కూడా లేదని.. కాబట్టి అతనికి ఓ సాధారణమైన వాతావరణాన్ని ఇవ్వడం చాలా ముఖ్యమని నెటిజన్లకు, మీడియాకు సూచించారు.

ఇక వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై జరుగుతున్న చర్చకు కపిల్ దేవ్ సూటిగా సమాధాన మిచ్చారు. ఒకవేళ ఆ కుర్రాడు అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి సిద్ధంగా ఉంటే.. ఇక ఆలస్యం చేయకుండా తుది జట్టులోకి తీసుకోవాలని అన్నారు. "చాలా మంది ఇంకా తొందరైపోతుందేమో అని అడుగుతున్నారు. కానీ నేనంటాను.. ఇప్పటికే చాలా ఆలస్యం కాలేదా? అతను సిద్ధంగా ఉంటే ఆడేందుకు అవకాశం ఇవ్వాలి" అని కపిల్ దేవ్ సూచించారు. అయితే సెలక్షన్‌తో పాటు వైభవ్ సూర్యవంశీ మానసిక ఎదుగుదలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని దయచేసి అతడిని ఓవర్‌హైప్ చేయొద్దని భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కోరారు.

# ‘వారణాసి’ మూవీ టీజర్ అప్డేట్ వచ్చేసింది రాజమౌళి సడన్ సర్ ప్రైజ్..!

సినిమా





సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రధానపాత్రలో దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘వారణాసి’ ప్రపంచ సినీ చరిత్రలోనే కనివినీ ఎరుగని విజువల్ వండర్ ?గా ఈ మూవీ తెరకెక్కుతోంది. గతంలో రిలీజ్ అయిన ఫస్ట్ గ్లింప్స్ తోనే అంతర్జాతీయ స్థాయిలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. అటు బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి భారీ విజయాల తర్వాత రాజమౌళి నుంచి వస్తున్న చిత్రం కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటి వరకూ వారణాసి మూవీ నుంచి ఫస్ట్ లుక్ గ్లింప్స్, సంచారి సాంగ్, రణకుంభ థీమ్ సాంగ్స్ మాత్రమే బయటకు వచ్చాయి. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇక గతంలో ఓ ఈవెంట్ లో రాజమౌళి మాట్లాడుతూ శ్రీరాముడి లుక్ లో ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్ ను పెట్టుకున్నానని తెలిపారు. ఇక ఇటీవల మహేశ్ బాబు శ్రీ రాముడి లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కానీ చిత్ర యూనిట్ దీనిపై అధికారికంగా ధ్రువీకరించలేదు. అయితే వారణాసి మూవీ నుంచి ఓ కీలక అప్డేట్ రానున్నట్లు సమాచారం. ఆగస్టు 9 న సూపర్ స్టార్ మహేశ్ బాబు జన్మదినం సందర్భంగా ఈ మూవీ నుంచి టీజర్ లేదా పోస్టర్ రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. గతంలోనూ ఆర్ఆర్ఆర్ చిత్రంలో ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా కొమురం భీమ్ పోస్టర్ ను.. అలాగే రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా అల్లూరి సీతారామరాజు పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఇప్పుడు అదే ప్రకారం మహేశ్ బాబు బర్త్ డే సందర్భంగా శ్రీరాముడు పోస్టర్ ను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది ఏప్రిల్ 7 న థియేటర్లలో విడుదల కానుంది. ఇక వారణాసి సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ నెగిటివ్? పాత్రలో కుంభ పాత్రలో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. కీరవాణి స్వరాలను సమకూరుస్తున్నారు. ఈ భారీ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్? పై కేఎల్? నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

# నాని నిర్మాణంలో నితిన్ - రుక్మిణి వసంత్ క్రేజీ కాంబో.. 'దండోరా' దర్శకుడికి బంపర్ ఆఫర్!

నిర్మాతగా 'అ!', 'హిట్' సిరీస్, 'కోర్ట్' చిత్రాలతో వైవిధ్యమైన విజయాలు అందుకున్న నేచురల్ స్టార్ నాని, తన వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను లైన్లో పెట్టినట్లు ఫిల్మ్ నగర్ టాక్. వరుస పరాజయాల తర్వాత కమ్‌బ్యాక్ కోసం చూస్తున్న హీరో నితిన్, 'కాంతార 1',




'డ్రాగన్' చిత్రాలతో పాన్-ఇండియా క్రేజ్ తెచ్చుకున్న రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో జంటగా నటించనున్నట్లు సమాచారం. ఇటీవల సామాజిక అంశాలతో 'దండోరా' చిత్రాన్ని వాస్తవికంగా తెరకెక్కించి విమర్శకుల ప్రశంసలు అందుకున్న సరికొత్త ప్రతిభావంతుడు మురళీకాంత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. చిత్ర పరిశ్రమలో విజయాలు, పరాజయాలు సహజం. కానీ, ఫ్లాపులతో సంబంధం లేకుండా కంటెంట్ నమ్మి ముందుకు సాగే హీరోలు, వైవిధ్యమైన పాత్రలతో మెప్పించే హీరోయిన్లు, విజన్ ఉన్న నిర్మాతలు కలిస్తే అక్కడ ఒక అద్భుతమైన సినిమా రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఇలాంటి ఒక సరికొత్త అంచనాలు పెంచే క్రేజీ కాంబినేషన్ గురించిన టాక్ బలంగా వినిపిస్తోంది. స్టార్ హీరోగా ఉంటూనే తన 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై ప్రయోగాత్మక చిత్రాలను నిర్మిస్తున్న నేచురల్ స్టార్ నాని వరుసగా వైవిధ్యమైన చిత్రాలను లైన్లో పెడుతున్న హీరో నితిన్ , పాన్-ఇండియా క్రేజ్ ఉన్న బ్యూటీ రుక్మిణి వసంత్ జంటగా ఓ భారీ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం.

**నిర్మాతగానూ నాని సక్సెస్**

నాని కేవలం వెండితెరపైనే కాకుండా, నిర్మాతగా కూడా టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్నారు. కమర్షియల్ ఫార్ములాకు భిన్నంగా, సరికొత్త కథలను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందే ఉంటారు. ఆయన బ్యానర్‌లో వచ్చిన మొదటి సినిమా 'అ!' విమర్శకుల ప్రశంసలతో పాటు రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఆ తర్వాత వచ్చిన 'హిట్' ఫ్రాంచైజీ టాలీవుడ్‌లో క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ఇటీవల ప్రియదర్శి ప్రధాన పాత్రలో వచ్చిన 'కోర్ట్' సినిమా రూ.50 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి నానికి మరో భారీ విజయాన్ని అందించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవితో సినిమా నిర్మిస్తూనే, మరోవైపు నితిన్‌తో ఈ కొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు నాని సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**నిరుత్సాహపడని నితిన్**

హీరో నితిన్ కెరీర్‌లో 'భీష్మ' తర్వాత 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్', 'రాబిన్ హుడ్', 'తమ్ముడు' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. వరుసగా అరడజను పరాజయాలు ఎదురైనప్పటికీ, నితిన్ ఎక్కడా నిరుత్సాహపడకుండా సరికొత్త కథలతో తన కెరీర్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రేష్ఠ మూవీస్ వంటి పెద్ద బ్యానర్లలో నటిస్తూనే, వి.ఆనంద్, అంజి వంటి భిన్నమైన దర్శకులతో ప్రాజెక్ట్‌లు ఓకే చేశారు.

# రహదారుల తోనే అభివృద్ధి సాధ్యం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్,జనసమయం ప్రతినిధి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. మొత్తం రూ. 1,775.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారుల విస్తరణ మరియు మరమ్మత్తు పనులకు గాను మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్ ప్యాకేజీ-1 పనులకు మక్తల్ పట్టణంలో శంకుస్థాపన నిర్వహించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో రహదారుల విస్తరణ, పటిష్టీకరణ మరియు నిర్వహణ పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రభుత్వ విప్ మరియు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ఫేజ్-1 కింద నాలుగు ప్రధాన ప్యాకేజీలుగా ఈ పనులను చేపట్టడం జరిగింది. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో రవాణా సదుపాయాలు మెరుగుపడి, ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులు ఏ ప్రాంత అభివృద్ధికైనా ప్రాణాధారమని అన్నారు. మెరుగైన రహదారుల ద్వారా గ్రామాలు, పట్టణాలు పరస్పరం అనుసంధానమై వ్యాపారం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యంగా రహదారుల అభివృద్ధి ద్వారా సమగ్ర ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ పనులు పూర్తయ్యాక ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల అమలుతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు పరిశ్రమలు, వ్యవసాయం, వాణిజ్య రంగాలకు కూడా ఊతం లభించే అవకాశముంది. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ ఎస్. ప్రియాంక కర్ణన్, మక్తల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు , ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A2074

JANASAMAYAM FORTNIGHTLY

# అలిసిన గొంతుకు అంతిమ వీడ్కోలు...



Editor, Publisher & Owner, & Place of Publication: V. YADAMMA H.No. C154,Parvathapur Village,Ghanapur Mandal Wanaparthy Dist.Telangana - 509380, email : janasamayam@gmail.com, Cell : 9381205266,8977022449
Printed at : Mythri Art Printers, Shop No. 10, Dcc Bank Complex, Mahabubnagar,Telangana-509001.
Office : H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037 www.janasamayam.com